వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 3
అక్టోబర్ 16-31, 2003

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

పేజీలు: 24
వెల: రూ.5-00

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥ 120/-లు

సంపాదకీయం:

ముందస్తుపై అనవసర రాద్ధాంతం

ఆంధ్రదేశంలో అన్ని రుతువులు అకాలంలో రావడం పరిపాటైపోయింది. అకాల వర్షాకాలం గడిచీ గడవకముందే ఎన్నికల రుతువు కూడా అకాలంగా రాబోతుందని రాజకీయపక్షాలు, పత్రికలు సూచిస్తున్నాయి. ఎన్నికలు వస్తే ప్రధానాంశాలు ఏమిటి, ఎవరెవరికి ఎన్నెన్ని సీట్లు దక్కుతాయి, ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు, ఎవరు ప్రభుత్వాధికారం చేపడతారు, రానున్న ముఖ్యమంత్రి చేయనున్న తొలి సంతకం ఏమిటి అని అప్పడే ఊహాగానాలు చెలరేగుతున్నాయి. దున్నపోతు ఈనిందంటే... అని సామెత చెప్పినట్లు దున్నపోతులాంటి ప్రభుత్వ యంత్రాంగం మీద ముందస్తు ఎన్నికల ఊహాగానాల చినుకులు కురుస్తున్నాయి. ఎనిమిది సంవత్సరాలలో అమలుచేయలేకపోయిన వరాల మూటలు ఈ పది పదమూడు రోజుల్లో అమలుచేసి కలిపి ప్రజలనోట్లో ముద్దలు పెట్టాలని అధికారపక్షం అరచేతిలో స్వర్గం చూపిస్తుంది. అధినాయకుడిమీద హత్యాప్రయత్నం సానుభూతిని సంపాదించలేదని స్పష్టమైపోయిన తర్వాత ఎన్నికలదాకా చేతికి కట్టుతోనైనా ఓట్లు సంపాదించాలని పాలకపక్షం ప్రయత్నిస్తుంటే లేని సానుభూతి ఉందనిరాస్తున్న పత్రికల మాట నిజమేనని నమ్ముతూ ప్రతిపక్షాలు గందరగోళంలో రోజుకోమాట మాట్లాడుతున్నాయి. ఎన్నికలంటూ వస్తే నక్సలైట్ల సమస్యనే ప్రధాన ఎన్నికల అంశం చేసుకుందాం రమ్మని అధికారపక్షం ఫౌల్‌చేసి బౌల్ చెయ్యడానికి ప్రయత్నిస్తుంది.

ఇంతకు ఎన్నికల జ్వరం ప్రవేశించిన తర్వాతనైనా పేదరికం కరువు, వలసలు, ఒక్క సంవత్సరం వర్షాభావానికే వ్యవసాయం తలకిందులైపోవడం, ఈ ఎనిమిది సంవత్సరాల్లో వందలాది పరిశ్రమలు మూతబడి లక్షలమంది కార్మికులు వారి కుటుంబాలు వీధినపడడం, విద్య, వైద్య, ఆరోగ్య, రవాణా, సాంఘిక సంక్షేమ సేవలన్నీ దిగజారిపోవడం, కొనలేనంత ఖరీదైపోవడం వంటి మౌలిక సమస్యలను ఏ ఒక్క రాజకీయపక్షమూ ఇప్పటిదాగా లేవనెత్తడంలేదు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాలుగా అనుసరిస్తున్న అభివృద్ధి వ్యూహపు మౌలిక లక్షణాల్లో ఇవన్నీ అని ఒక్క పక్షమైనా పేర్కొనడం లేదు. ఎన్నికలు ముందుకు జరపడమో, సమయానికి జరుపడమో ముఖ్యమైన సమస్య అన్నట్టుగా మాట్లాడుతున్నారు. ప్రజాజీవితానికి సంబంధించినంతవరకు సమస్యలేకాని నక్సలైట్ల సమస్యనో, సానుభూతినో ప్రధాన సమస్యలుగా మార్చి ఎన్నికల బరిలోకి దిగడానికి అన్ని పార్టీలు తహతహలాడుతున్నాయి. అసలుసమస్యలను విస్మరింపజేసి సమస్యలేకానివాటిమీద ఎన్నికలలో భీకర ఘర్షణ జరపడం అన్ని రాజకీయ పక్షాలకు ఒక కళగా అలవాటైంది.

అందువల్ల ఇవాళ ఎనిమిదికోట్ల తెలుగు ప్రజానీకం ముఖ్యంగా అందులోని అయిదారు కోట్లమంది ఓటర్లు ఏ రాజకీయ పక్షాన్నైనా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిలదీయవలసింది ఈ ఉత్తుత్తి కుహనా సమస్యలమీదకాదు. అభివృద్ధి వ్యూహం ఏమిటనేది మౌలిక ప్రశ్న కావాలి. పేదరికం తొలగించే మార్గం ఏమిటి? ఎనిమిది సంవత్సరాల హైటెక్‌పాలనలో హైదరాబాద్ నగరానికో, సంపన్నులకో, బహుళజాతి సంస్థలకో ఈ రాష్ట్ర సంపదలను దోచిపెట్టిన అనుభవం తర్వాత ఇక ఎన్ని మాయమాటలైనా ప్రజలను నమ్మించలేవు. ఉపాధి కల్పిస్తానని నిరుద్యోగం పెంచిన పాలనను, స్వర్ణాంధ్ర సాధిస్తానని చెప్పి ప్రాంతీయ అసమానతలను పెంచిన పాలనలను, వ్యవసాయరంగాన్ని నీటిపారుదలను చిన్నచూపుచూసి రైతులను అంతర్జాతీయ మార్కెట్ల దుర్మార్గాలకు బలిచేసి వేలమంది అన్నదాతల ఆత్మహత్యలకు కారణమైన పాలనను, ప్రకృతి వైపరీత్యాల దాడినుంచి ప్రజలను రక్షించలేకపోయిన పాలనను, తమ కనీస అవసరాల కోసం అతిచిన్న నిరసన ప్రకటించినా దుర్మార్గంగా అణచివేతను అమలుచేసిన పాలనను అడగవలసిన ప్రశ్నలేమిటో ప్రజలకు తెలుసు. ఆ పాలనను మార్చదలచుకొని తెరలపక్కన నిరీక్షిస్తున్న కొత్త నటులనుంచి పొందవలసిన హామీలేమిటో కూడా ప్రజలకు తెలుసు. అది ముందస్తు ఎన్నికలైనా సరైన సమయపు ఎన్నికలైనా కావలసిందల్లా ఆ ప్రశ్నలడగడానికి ప్రజలకు అవకాశం. తమ ఆకాంక్షలను ప్రకటించడానికి గొంతెత్తడానికి నిర్బంధంలేని స్వేచ్ఛాయుతమైన వాతావరణం.

పట్టిక 1
తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికలో కేటాయింపులు అసలు చేసిన ఖర్చు పదవ పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించిన కేటాయింపులు

(రూ. కోట్లలో)

రంగం	9వ ప్రణాళిక		10వ ప్రణాళిక
	ఆమోదించిన పరివ్యయం	అసలు చేసిన ఖర్చు	ప్రతిపాదించిన పరివ్యయం
ఎ. ఆర్థిక సర్వీసులు	18593.76	24204.16	32500.79
1. వ్యవసాయం మరియు సంబంధిత కార్యకలాపాలు	505.39	942.20	2333.21
2. గ్రామీణాభివృద్ధి	1922.49	1386.61	4592.07
3. ప్రత్యేక ప్రాంత అభివృద్ధి	946.22	1293.58	1123.52
4. సాగునీరు, వరదనివారణ	6006.80	5944.45	10844.98
5. శక్తి	5752.37	9091.93	7141.72
6. పరిశ్రమలు-ఖనిజం	962.13	811.85	1655.11
7. రవాణా	2416.47	4158.87	3994.19
8. వైజ్ఞానం, విజ్ఞానం, పరిసరాలు	17.43	12.96	11.20
9. సాధారణ ఆర్థిక సర్వీసులు	64.46	561.71	804.80
బి. సాంఘిక సర్వీసులు	6460.07	5929.84	13634.04
సి. సాధారణ సర్వీసులు	96.17	264.23	479.16
మొత్తం	2515.00	30398.23	46614.00

ఆధారం: 1. వార్షిక ప్రణాళిక 2003-04, ప్రణాళికాశాఖ, ఆంధ్రప్రదేశ్
2. 10వ పంచవర్ష ప్రణాళిక-సంపుటం 1-కేంద్ర ప్రణాళికా సంఘం

పట్టిక 2
10వ పంచవర్ష ప్రణాళికలో రంగాలవారీగా అభివృద్ధి లక్ష్యాలు

(సాలుసరి సగటు శాతం)

రాష్ట్రం	వ్యవసాయం	పరిశ్రమలు	సర్వీసులు	స్థూల రాష్ట్ర ఉత్పాదక అభివృద్ధి
ఆంధ్రప్రదేశ్	3.05	8.01	8.39	6.8
అస్సాం	3.82	5.00	9.00	6.2
బీహార్	3.75	6.00	8.00	6.2
గుజరాత్	4.03	12.23	10.44	10.2
హర్యానా	4.07	9.56	10.33	7.9
హిమాచల్‌ప్రదేశ్	4.55	12.49	8.26	8.9
జమ్మూ-కాశ్మీర్	4.20	5.21	8.00	6.3
కర్ణాటక	4.99	11.34	12.51	10.1
కేరళ	3.05	5.89	8.17	6.5
మధ్యప్రదేశ్	4.00	7.75	9.00	7.0
మహారాష్ట్ర	3.56	8.22	8.09	7.4
ఒరిస్సా	4.07	4.88	8.73	6.2
పంజాబ్	4.07	8.06	8.00	6.4
రాజస్థాన్	4.50	10.06	9.63	8.3
సిక్కిం	5.00	5.21	10.36	7.9
తమిళనాడు	3.54	7.37	9.37	8.0
త్రిపుర	3.90	9.37	8.43	7.3
ఉత్తరప్రదేశ్	4.67	11.05	7.92	7.6
పశ్చిమబెంగాల్	4.0	8.9	9.4	8.0

ఆధారం: 10వ పంచవర్ష ప్రణాళిక 2002-2007, కేంద్ర ప్రణాళికా సంఘం.

పట్టిక 3
2006-07 నాటికి పేదరికం కింద వుండబోతున్న జనాభా అంచనా

(శాతం)

రాష్ట్రం	గ్రామీణ	పట్టణ	మొత్తం
ఆంధ్రప్రదేశ్	4.58	18.99	8.49
అస్సాం	37.89	4.48	33.3
బీహార్	44.81	32.69	43.18
గుజరాత్	2.00	2.00	2.00
హర్యానా	2.00	2.00	2.00
హిమాచల్‌ప్రదేశ్	2.00	2.00	2.00
జమ్మూ-కాశ్మీర్			
కర్ణాటక	7.77	8.00	7.85
కేరళ	1.63	9.34	3.61
మధ్యప్రదేశ్	28.73	31.77	29.52
మహారాష్ట్ర	16.96	15.20	16.18
ఒరిస్సా	41.72	37.46	41.04
పంజాబ్	2.00	2.00	2.00
రాజస్థాన్	11.09	15.42	12.11
తమిళనాడు	3.68	9.64	6.61
ఉత్తరప్రదేశ్	24.25	26.17	24.67
పశ్చిమబెంగాల్	21.98	8.98	18.30
భారతదేశం	21.07	15.06	19.34

ఆధారం: 10వ పంచవర్ష ప్రణాళిక 2002-2007, కేంద్ర ప్రణాళికా సంఘం.

అనివార్య కారణాల వల్ల 'నిత్యజీవితంలో బహుళజాతి సంస్థలు' శీర్షికను అందించలేకపోతున్నాము. వచ్చే సంచికనుండి యథావిధిగా అందించగలము - సం

ముఖ్యమంత్రి రక్షణకు మూడువేల పోలీసులా!

నారా చంద్రబాబునాయుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి. ఆయన ఎక్కడకు వెళ్ళినా ఆయనకు రక్షణ కల్పించటం భద్రతా యంత్రాంగం బాధ్యత. కాని ఆయన కుటుంబసమేతంగా తిరుపతి వెళ్ళింది తిరుమలేశునికి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి. ఇటీవల ఆయనమీద అదే తిరుపతిలో జరిగిన దాడి దృష్ట్యా భద్రతా యంత్రాంగం మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లుచేయటం సహజం. కాని ఆ "మరింత" ఎంత? తిరుమల క్షేత్రాన్నంతా పోలీసులమయం చేసేటంత గానా? ప్రభుత్వ ధనాన్ని కొన్ని లక్షలమేరకు ఖర్చుచేయటం వరకా? ఒక వ్యక్తి రక్షణకు ఆయన ముఖ్యమంత్రే కావచ్చు. మూడువేలమంది పోలీసులా? రోజుకు సగటున తిరుపతికి పదివేలమంది భక్తులు వస్తూంటారు. వారందరికీ దర్శనం బంద్ (ముఖ్యమంత్రి పోలీసు అధికారులను మందలించారనుకోండి). ఇదే ఆయన భద్రతకు కొలబద్ద అయితే, వచ్చేనెలల్లో ఆయన ఎన్నికల ప్రచారానికి బయలుదేరితే, లేదా ఇదివరకటిలాగే జిల్లాల పర్యటనకు వెళితే, రక్షణ కవచాన్ని ఇంత పకడ్బందీగా ఏర్పాటు చేస్తారా? అసలే జనం రకరకాల కారణాలతో అసంతృప్తులైవున్నారు. నక్సలైట్లు దాడితో సానుభూతి ఏమీ పెల్లుబుక లేదు. దేశం శాసనసభ్యులు లారీల్లో జనాన్ని చేరవేయటం ద్వారా సానుభూతి పవనాలు "సృష్టించారు". తెలివైన ముఖ్యమంత్రి కాబట్టి దానిని ఓట్లుగా మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని సానుభూతి ఏమీ పెనుగాలులై వీచటం లేదు. అయ్యో పాపం అనుకోవటం మించి ఏమీలేదు. అలాంటప్పుడు అలాంటి ప్రజలకు తనకు మధ్యన రక్షణగోడ పోలీసులు నిర్మిస్తే, ఆయన, ఆయనపార్టీ ఆ గోడవెనకాలే వుండిపోతారు.

* * * *

రాష్ట్రాలు ద్రవ్యపరమైన ఇబ్బందుల్లో వున్నపుడు తాత్కాలికంగా రిజర్వుబ్యాంకు చేబదులిస్తుంది. దీనినే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సు అంటారు. పరిస్థితి ఇంకా క్షీణిస్తే ఓవర్ డ్రాఫ్టు అంటారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రం ఈ చేబదుళ్ళను ఎక్కువసార్లు తీసుకోవటం, ఎక్కువరోజులు తీసుకోవటం జరుగు తుంది. అయితే గత సంవత్సరం ఇలా చేబదుళ్ళు తీసుకున్న రోజుల సంఖ్య 01-02లో 336 రోజుల నుంచి 72కు, ఓవర్‌డ్రాఫ్టులు తీసుకున్న రోజుల సంఖ్య 133 నుంచి 33కు పడిపోయింది. చూచారా, ఆర్థిక పరిస్థితిని ఎంత చక్కగా మానేజ్ చేస్తున్నామో అని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు తనకుతానుగా కితాబు ఇచ్చుకున్నారు. ఇలా తగ్గిపోవటం వెనుకనున్న రహస్యాన్ని రిజర్వు బ్యాంకు తాజా వార్షిక నివేదిక బయటపెట్టింది. రాష్ట్రం ఓవర్‌డ్రాఫ్టు తీసుకుంటే ఇదివరకు 12 రోజుల వరకూ ఓవర్‌డ్రాఫ్టులో వుండే అవకాశం వుండేది. అది ఇప్పుడు 14 రోజులకు పెంచారు (మధ్యన సెలవులు, ఆదివారాలు కాకుండా). ఇది మొదటి కారణమైతే, చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం నుంచి ఎక్కువ ఆదాయం, మార్కెట్ రుణాలు ఎక్కువగా సేకరించటం వల్ల, రిజర్వుబ్యాంకు వద్దకు చేబదులుకు గాని, ఓవర్ డ్రాఫ్టుకు గాని వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. ఉదాహరణకు మార్కెట్ నుంచి రుణసేకరణ (గ్రాస్) 00-01లో రూ.1399 కోట్లు, 01-02లో రూ. 2055 కోట్లు తీసుకుంటే, 02-03లో రూ.3401 కోట్లు సేకరణ జరిగింది. కాదు మేము ద్రవ్యపరిస్థితిని చక్కగా మానేజ్ చేశామని ఆర్థికమంత్రి అంటారా? అదేమీకాదు. ఎందుచేతనంటే చాలా రాష్ట్రాలు గతంతో పోలిస్తే చాలా తక్కువరోజులు రిజర్వుబ్యాంకు వద్దకు వెళ్ళాయి.

* * * *

సమ్మెలు నిషిద్ధమని సుప్రీంకోర్టు అంటుంది; ఊరేగింపులు తీయకూడదని కలకత్తా హైకోర్టు అంటుంది. మీటింగు పెట్టుకున్నా, ఊరేగింపు తీయదలచుకున్నా మా అనుమతి తీసుకోవాలంటుంది హైదరాబాదు పోలీసు. సమాచారహక్కు చట్టం చేయనక్కర్లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంటుంది. ఆ మధ్య కేరళ హైకోర్టు కూడా ఇలాంటి నిషేధాన్ని ఏదో విధించింది.

ఊరేగింపులను నిషేధిస్తూ కలకత్తా కోర్టు జస్టిస్ అమితవలాలా "నగరంలో డిజార్డర్, చావోస్‌ను కోర్టు చూస్తూ ఊరుకోదు" అని అన్నారు. గుజరాత్‌లో వందలమందిని చంపేస్తుంటే కోర్టు స్పందించ లేదు. హింసను అణచివేసే పేరుతో రాష్ట్రంలో పేదలనుఇళ్ళల్లోనుంచి తీసుకొనివెళ్ళి ఎన్‌కౌంటర్ చేస్తూపోతుంటే కోర్టు స్పందించలేదు. కొంతకాలం ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోసేస్తే, కోర్టు కిక్కురుమన లేదు. ప్రశాంతంగా రాజ్యాంగం అనుమతించిన మేరకు ప్రదర్శనలు చేస్తుంటే, పోలీసులు లాఠీచార్జీ చేస్తుంటే, ఇది అధర్మం అని కోర్టు చెప్పదు. గిరిజనుల భూములను చట్టవ్యతిరేకంగా మైదానప్రాంత వాసులు ఆక్రమించుకుంటే, అవి కోర్టుకు కనపడవు. స్త్రీలను మానభంగం చేసినవారిఅంగాలను నరికివేస్తే, ఇతరులు ఒళ్ళు దగ్గర పెట్టుకొని అలాంటి మానభంగాలు మళ్ళీ జరగవు. కాకపోయినా, అలాంటి తీవ్రశిక్ష ఏదో వేయాలనే ఆలోచన కోర్టుకురాదు. జడ్జిగారి కారు ఒకఊరిలో చిక్కుకునిపోయిందట. ఆయనకు కోపంవచ్చి, కోర్టుకు వెళ్ళీవెళ్ళడంతోనే ఒక ఆర్డరు ఇచ్చేశారు. అలాంటి ఊరేగింపు లకు, సభలకు కోల్‌కతా పెట్టిందిపేరు. ఇన్ని దశాబ్దాలుగా ఊరేగింపులు జరుగుతున్నాయి. అలాంటి ఊరేగింపులు జరిగి నప్పుడు ప్రజలకు అసౌకర్యం కలుగుతుందన్న మాట వాస్తవమే. అలాంటప్పుడు ప్రజలకు అసౌకర్యం కలుగనివిధంగా చూడాల్సిన బాధ్యత పోలీసులది. పోలీసులచేతుల్లో వుండాల్సిన లాఠీ జడ్జిల చేతుల్లోకి ఎప్పుడు వచ్చింది?

\- *విహారి*

మళ్ళీ అయోధ్య విషయంలో ఆంతర్యాలు, అనర్థాలు

— తెలకపల్లి రవి

అయోధ్యలో అక్టోబరు 17వ తేదీన వి.హెచ్.పి. తలపెట్టిన "సంకల్ప దివస్" శాంతిభద్రదల సమస్యగా విషమించకుండా యుక్తియుక్తంగా నివారించటంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయంసింగ్‌యాదవ్ కృతకృత్యులవడం దేశమంతటికీసంతోషం కలిగించింది. కాని ఇంతటితోనే సమస్య సమసిపోయిందనే భావం మాత్రం ఎవరికీ లేదు. కన్యాశుల్కం నాటకంలో సీసాలో భూతాన్ని తీస్తానన్నట్లు సంఘపరివార్ మాటిమాటికి తన అయోధ్య సమస్యను తన అమ్ములపొదిలోంచి తీస్తూనేవుంటుందని ఇప్పటికి చాలాసార్లు రుజువైన సత్యం.

నాలుగేళ్ళ పాలన పూర్తిచేసుకున్న ఎన్‌డిఎ సర్కారుకు సారధ్యం వహిస్తున్న బిజెపి చెప్పుకోవడానికి గొప్ప ఏమీలేకపోగా అన్నివైపుల నుంచి సమస్యలను, సంక్షోభాలను ఎదుర్కొంటున్నది. అయినా అది అధికారం కొనసాగగలుగుతున్నదంటే ఏకైక కారణం తెలుగుదేశం, సమతా, తృణమూల్, డిఎంకె వంటి పార్టీలు లౌకిక విలువలకు తిలోదకాలిచ్చి దాన్ని అంటిపెట్టుకుని వుండటమే. రాయ్‌బరేలి కోర్టు అయోధ్య వ్యవహారంలో మురళీమనోహర్‌జోషీ తదితరులపై అభియోగాల నమోదుకు ఆదేశాలిచ్చిన తరువాత అత్యున్నతస్థాయిలో సాగిన ప్రహసనం, అంతకుముందు వెంకయ్య నాయుడు లోహ్‌పురుష్, వికాస్‌పురుష్ వివాదం ఇవి బాగా తెలిసినవే. అలాగే బెస్ట్ బేకరీ కేసులో సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి వేసిన మొట్టికాయలు, కొట్టిన ఛీత్కారాలు అక్కడ విజయం సాధించానన్న ఆనందాన్ని హరించేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో తోసుకొస్తున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవడానికి బిజెపికి వేరే అస్త్రమంటూ లేకుండాపోయింది. అందుకై మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు సంఘపరివార్ విభాగమైన విహెచ్‌పి మళ్ళీ సంకల్పదివస్ తలపెట్టింది. శిలాన్యాస్, కరసేవ, అంతిమంగా 1993 డిసెంబరు ఆరున బాబ్రీవిధ్వంసం చూసిన దేశ ప్రజానీకానికి పేరేదైనా జరిగేది ఉద్రేకాలు పెంచడమేనని బాగా తెలుసు. నిజంగా జరిగిందీ అదే. అశోక్‌సింఘాల్, ప్రవీణ్ తొగాడియా వంటివారి కవ్వింపు ప్రకటనలు, బెదిరింపులు వాతావరణాన్ని పూర్తిగా విషపూరితం చేశాయి. సంఘపరివార్ స్క్రిప్టు ప్రకారం ఈ సందర్భంలో బిజెపి ప్రభుత్వంపైనా వారు ధ్వజమెత్తకపోలేదు. ఇదంతా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం తప్ప మరేమీకాదు. తనపై అంతగా చిందులుతొక్కుతున్న విహెచ్‌పిని నమ్మవలసిందిగా వాజ్‌పేయి, అద్వానీలు ములాయంకు సలహా ఇవ్వటంలో సారాంశం అదే. బాబ్రీ విధ్వంసానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన అద్వానీ ఇప్పుడు హోమ్‌మంత్రిగా వుండి విహెచ్‌పి అనుకూల స్వరాలు వినిపిస్తుంటే ఆయన సహాయమంత్రి చిన్మయానంద మరోఅడుగు ముందుకేసి నేరుగా విహెచ్‌పికి సహకరించే బాధ్యత చేపట్టారు. ఇందుకుగాను ములాయం ఆయనను పేరుపెట్టి విమర్శించవలసి వచ్చింది కూడా. చివరకు సమస్య ఎలాగో ముగిసిపోయిందంటే అందుకు ఒక కారణం ములాయం ప్రభుత్వం కనపరచిన సుదృఢ వైఖరే తప్ప విహెచ్‌పి విశ్వసనీయత కాదు.

అదే సమయంలో రెండవ ముఖ్య కారణాన్ని కూడా విస్మరించ డానికి లేదు. సంఘపరివార్ ఎంత హడావుడి చేస్తున్నా జనబాహుళ్యం ఈ సమస్యపట్ల పెద్ద ఆసక్తిగా లేదని తేలిపోయింది. వారి సంకల్పంలో పాలుపంచుకోవడానికి ప్రజలు ఉత్సాహం చూపలేదు. బాబ్రీమసీదు నాటికన్నా ఇప్పుడు స్పందన బాగా తగ్గిపోయింది. అందువల్లనే ములాయంతీసుకున్న దృఢమైనవైఖరి విహెచ్‌పి ఆటకట్టించటంలో సఫలమైంది. వివాదాస్పద స్థలానికి సమీపంలో అది గాని, మరో సంస్థ గాని ఎలాంటి సమ్మేళనం జరపనివ్వరాదని అలహాబాదు హైకోర్టు అక్టోబరు 14న ఇచ్చిన స్పష్టమైన ఆదేశం ములాయంకు బాగా సహాయపడింది. కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఏదోవిధంగా ఆయనకు సహకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. వంద కంపెనీల సాయుధ బలగాలను పంపింది. జిల్లా అధికార యంత్రాంగం సహాయంతో ములాయం పరిస్థితిని అదుపుచేయ టానికి వీలేర్పడింది. 1992లోనైతే యు.పి.లో బిజెపి ప్రభుత్వం నేరుగా విధ్వంసానికి ప్రేరణనిచ్చే పాత్ర పోషించగా కేంద్రంలోని పి.వి.నరసింహారావు ప్రభుత్వం కూడా ప్రేక్షకపాత్రకే పరిమితమైంది. అందుకు భిన్నమైన ప్రస్తుత అనుభవం రాజకీయ సంకల్పం వుంటే మతోన్మాదుల దుస్సంకల్పాలను భగ్నం చేయడం సమస్య కాదని నిరూపించింది. ఆఖరుకు బిజెపి అధ్యక్షుడు వెంకయ్యనాయుడు కూడా ఎలాంటి సంఘటనలు లేకుండా చూసినందుకు అభినందించ వలసి వచ్చింది.

అయితే అయోధ్యలో ఈ తాజా అధ్యాయం ముగిసీ ముగియక ముందే కేంద్రం అయోధ్య సమస్యపై రాజీపథకం గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. ఏడాదిక్రితం శంకరాచార్యులు రాజీ పథకం పేరుతో సంఘపరివార్ ప్రతిపాదనలను నెత్తిన మోస్తూ వచ్చిన సంగతిని గుర్తుచేస్తున్నది. ముస్లిములు వివాదస్థలాన్ని వదులుకోవాలని చెప్పడం ఈ రాజీ సారాంశం. అయోధ్యను

వదులుకుంటే కాశీ మధురలపై పట్టుపట్టకుండా చూస్తామని మధ్యవర్తులనే వారు చెబుతుండగా అదేమి లేదని విహెచ్‌పి కుండబద్దలు కొట్టినట్లు చెబుతుంటే, తమవెనుక రాజకీయ పార్టీలు ఏమీలేవని విహెచ్‌పి చెప్పే మాటలు కేవలం బూటకాలు. అతి తీవ్ర హిందూత్వాన్ని ఆచరణలో పెట్టేందుకే దాన్ని స్థాపించారు. సంఘపరివార్ విభాగాల మధ్య తేడాలు నామకార్థమైనవే. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా వున్న నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారు. భజరంగ్‌దళ్ అధ్యక్షుడైన వినయ్‌కతియార్ యు.పి. బిజెపి అధ్యక్షుడైనాడు. ఇలాంటి ఇచ్చిపుచ్చుకోవటాలు వాటి అవినాభావాన్నే తెలుపుతాయి.

నవంబరులో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో బిజెపి పరిస్థితి ఏమంత అనుకూలంగా లేదని జనాభిప్రాయం. ఢిల్లీ రాజస్థాన్‌లలో కాంగ్రెస్ నెగ్గుతుందని, మిగిలిన రెండు రాష్ట్రాలలో కూడా బిజెపి పెద్దగా సాధించగలిగేది ఏదీలేదని పరిశీలకుల మాట. ఈ నేపథ్యంలో అయోధ్యవంటి కృత్రిమ సమస్యలు లేవనెత్తడం ద్వారా బిజెపికి మేలుచేయాలని సంఘపరివార్ విశ్వప్రయత్నం చేస్తుంది. గతంలో రథయాత్ర కాలంనుంచి కూడా బిజెపి, ఆరెస్సెస్‌లు మతకలహాలు రగిలించిన ప్రతిసారీ రాజకీయంగా లాభం పొందుతూ వస్తున్నాయి. ఉదాహరణకు 1989లో భాగల్పూరు మతకలహాలతో సమాధారుణ మతకలహాలు సాగినచోట్లనే బిజెపి బలం పెరిగి 88కి చేరుకోగా 1990లో రథయాత్ర తరువాత 1991 ఎన్నికల్లో దాని సీట్ల సంఖ్య బాగా పెరిగింది. గుజరాత్‌లో కూడా జాతిహత్యాకాండ తరువాత 2002లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి అధికారంలోకి రాగలిగింది. ఈ పదేళ్లలో దేశ రాజకీయ పొందికలలోనూ, తీరుతెన్నులలోనూ చాలా మార్పులు వచ్చాయి. 1992లో బాబ్రీ విధ్వంసానికి పాల్పడినందుకు అద్వానీ ప్రభృతులను అరెస్టుచేసి కేసులు బలహీనంగానైనా సరే పెట్టారు. కాని మోడీ మాత్రం భుజకీర్తులతో మళ్ళీ అధికారంలోకి రాగలిగారు. గుజరాత్‌లో పునరాగమనం దేశమంతటా పునరావృతమవు తుందన్నట్లు బిజెపి నేతలు అమితానందం ప్రదర్శించారు. కాని అది అట్టేకాలం నిలబడలేదు. గుజరాత్‌లోనే వరుసగా కోర్టుల అభిశంసనలు రావడంతోపాటు స్థానిక ఎన్నికలలోనూ, ఇతరత్రా సందర్భాల్లోనూ కూడా బిజెపికి ఎదురుదెబ్బలు తగిలాయి. అంతర్జాతీయ వ్యవహారాలలో అమెరికాకు ఉపగ్రహంగా వుండడం పట్ల ప్రజలలో వ్యక్తమైన తీవ్ర నిరసన కారణంగా ఇరాక్‌కు సేనలు పంపే ఆలోచనలు కూడా విరమించుకోవలసివచ్చింది. తెహల్కా వ్యవహారం లాంటివి ఆ పార్టీనేతల రాజకీయ అవినీతిని వెల్లడించాయి. ఇందుకుతోడు అంతర్గత కలహాలు. ఇలాంటి పరిస్థితులలో అయోధ్య కార్డును మరోసారి ప్రయోగించడానికే సంఘపరివార్ మరోసారి సిద్ధమైంది. మొదట అయోధ్యలో ఎఎస్‌ఐ తవ్వకాలలో ఆలయం ఉన్నట్లు ఆధారాలు దొరికాయనే పేరిట నాటకం నడిపినా అది తక్షణ ఫలితాన్నివ్వలేకపోవడంతో నేరుగా విహెచ్‌పిని రంగంలోకి దింపింది.

తాను స్వయంసేవకుడనని న్యూయార్క్‌లో ప్రకటించిన వాజ్‌పేయి అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగుతుందని అయోధ్యలో ఇటీవలే ప్రకటించిన సంగతి మరచిపోలేము. ఎఎస్‌ఐ తవ్వకాల ప్రహసనం తర్వాత అద్వానీ మరింత సూటిగా రామాలయ నిర్మాణం అజెండాలో ఉన్నట్టు ప్రకటించాడు. ఆ అంశం వల్లనే తమ బలం పెరిగిందిని చెప్పుకోవడానికి ఏమాత్రం వెనుకాడని అద్వానీ హోంమంత్రిగా వుండి సిబిఐకి ఆధ్వర్యం వహిస్తున్నారు. సిబిఐ లోపభూయిష్టంగా వాదించినందునే ఆ కేసులో ఆయన బయటపడగలిగారు. ఆయన సహాయకుడైన చిన్మయానంద విహెచ్‌పికి సహకరిస్తున్నాడని ములాయం బహిరంగంగానే విమర్శించారు. ఇలాంటి నేతలు కేంద్రంలో అధికారంలో వుండగా మతోన్మాదం ఏరూపం తీసుకుంటుందనేది ఊహించుకోవచ్చు.

యుపిలో ములాయంసింగ్ అధికారంలోకి రావడం వాస్తవానికి సంఘపరివార్ ఎత్తుగడలకు పెద్ద విఘాతం. ఆయనను హిందూ వ్యతిరేకిగా చూపి తమ పబ్బం గుడుపుకోవాలని ప్రస్తుత సంకల్ప దివస్ తతంగం తలపెట్టగా ఆయన సమయస్ఫూర్తితో వ్యవహరించి విఫలం చేశారు. ఆయన వైఖరిని కాంగ్రెస్, వామపక్షాలు, అనేక పత్రికలు బలపరిచాయి. ఇదంతా లౌకిక శక్తులకు సంతోషం కలిగించే విషయం. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య ఏర్పడిన అవగాహన బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి దోహదపడుతుందని భావిస్తుండగా అవి రెండూ ఎడమొహం పెడమొహం అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. హిందూత్వ పేరుతో సాగే మెజారిటీ మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికపక్షాలు నిలకడగా నిలబడకపోవడం వల్ల గతంలో చాలా హాని జరిగింది. ఈ పాఠాలు ఎవరు మర్చిపోయినా అనర్థం తప్పదు. సంఘపరివార్ ఇరకాటంలో వున్న స్థితిలో ఎన్‌సిపి సోనియాగాంధీ విదేశీయత సమస్యను మరోసారి లేవనెత్తి వివాదం రేపింది. అయితే ఇంతలోనే శరద్‌పవార్ దాన్ని సర్దుకోవడం కొంత మెరుగు..వేలాదిమంది ప్రజల ధనప్రాణాలతో దేశ భవిష్యత్తుతో చెలగాటం ఆడే అంశాలను సంఘపరివార్ ఇంత బాధ్యతారహితంగా లేవనెత్తడం బిజెపి కూటమి ప్రభుత్వం దోబూచులాడుతూ వంతపాడడం అత్యంత దారుణమైన విషయం. ఏమైనా అయోధ్య వివాదంతోసహా హిందూత్వ మూల నినాదాలను మరోసారి తీవ్ర స్థాయిలో రగిలించేందుకు సంఘ పరివార్ సిద్ధమవుతుండగా లౌకిక పక్షాలలో మరింత అప్రమత్తత అవసరం. ○

సెంటు భూమికూడా లేని 38 శాతం దళిత కుటుంబాలు

— వి. హనుమంతరావు

మొదటి విడత వెలుగు పథకాన్ని శ్రీకాకుళం, అనంతపురం, అదిలాబాద్ జిల్లాల్లో ప్రారంభించకముందు, ఆ జిల్లాల్లో పరిస్థితుల గురించి హైదరాబాద్‌లోని సెస్ సంస్థ ఒక సర్వే జరిపింది. 138 గ్రామాల్లో 2760 కుటుంబాలను, 276 స్వయం సహాయక గ్రూపులను, మూడు మండలాల మహిళా సమాఖ్యలను ఎంచుకొని ఈ సర్వే నిర్వహించింది. గ్రామాల్లో ఎస్‌సిలు, ఎస్‌టిలు వెనుకబడిన తరగతులు(వె.బ.త.), ఇతరకులాలవారీగా సర్వే జరిపినా, ఈవ్యాసం కేవలం ఎస్‌సిల జీవనస్థితిగతుల విశ్లేషణకుమాత్రమే పరిమితమైంది.

సెస్ డైరెక్టర్ ఎస్. మహేంద్రదేవ్ పర్యవేక్షణలో ఎస్. గలాబ్ నాయకత్వాన మరో నలుగురితో కలిసి ఈ సర్వే నిర్వహించారు. గ్రామాల్లో దళితులు అత్యంత నికృష్టమైన జీవితం గడుపుతుంటారన్న విషయం అందరికీ తెలిసిన విషయమే. వారిలో అత్యధికులు వ్యవసాయ కూలీలు. చెదురుగామదురుగా ఎవరికైనా భూమివున్నా, వారిలో ఎక్కువమంది కుంటా, సెంటు భూమి ఉన్నవారే. భూసంస్కరణలు అమలుపరిచిన తర్వాతకూడా వారు భూమిలేని నిరుపేదలుగానే వుంటూ ప్రధానంగా వ్యవసాయ కూలీలుగానే జీవితం వెళ్ళబుచ్చుతున్నారు. కాగా, పేదరికాన్ని నిర్మూలించటంలో నిజమైన భూసంస్కరణలు ప్రధానపాత్ర వహిస్తాయి. భూపంపకం జరిగి పేదరికం తొలగిపోతే, ఆమేరకు పేదరికం నిర్మూలన కోసం ప్రభుత్వం చేసే ఖర్చు ఆదా అవుతుంది. కాగా, ముందు భూమి యాజమాన్యం గురించి ఈ సర్వే ఏం చెబుతుందో చూద్దాం.

దళితుల్లో 38 శాతం కుటుంబాలకు సెంటుభూమి కూడాలేదు. భూమివున్నవారి సగటు భూకమతం విస్తీర్ణం కేవలం 1.5 ఎకరం మాత్రమే. అదే వె.బ.త.కు 2.39 ఎకరాలు, ఇతర కులాలవారు 4.65 ఎకరం విస్తీర్ణంకల భూకమతాలు వున్నాయి. సొంత భూమికలవారిలో తక్కువలో తక్కువ భూమి వున్నది ఎస్.సి.లకే. వారిలో చాలా తక్కువ మందికే నీటిపారుదల సౌకర్యం అవకాశం వుంది. 11 శాతం మంది భూమికౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. అసలే వారు వ్యవసాయం చేసే భూమి కాస్తంత అయితే, అందులో 28 శాతం కౌలుకు తీసుకున్న భూమే. ఇందుకు సంబంధించిన వివరాలు కింది పట్టికలో చూడవచ్చు.

	సగటు కమతం విస్తీర్ణం (ఎకరాలు)			నీటి
	సొంతం	కౌలుకు తీసుకున్నది	కౌలుకు ఇచ్చింది	పారుదల గల భూమి
దళితులు	1.50	0.25	0.19	0.33
ఎస్.టి.లు	2.19	0.26	0.27	0.38
వె.బ.త.	2.39	0.26	0.17	1.02
ఇతర తరగతులు	4.65	0.29	0.74	1.91
భూమిలేనివారు	–	2.40	–	–
సన్నకారు రైతులు	1.12	0.22	0.12	0.36
చిన్న రైతులు	3.10	0.28	0.31	1.04
సెమీ మీడియం	6.50	0.23	0.72	2.46
మీడియం	13.80	–	1.44	6.54
పెద్ద	31.05	–	5.79	13.26
మొత్తం	2.68	0.27	0.30	0.99

ఈ పట్టిక కేవలం దళితులకే కాక, అన్ని తరగతులవారికి సంబంధించినదిగా గమనించాలి. అందరికన్నా చిన్న సొంత కమతాలున్నది దళితులే. ఇతర తరగతులవారి సగటు భూమి విస్తీర్ణంలో నీటిపారుదల సౌకర్యం వున్న భూమి 41 శాతం అయితే, దళితులకు 22 శాతం భూమికే ఆ సౌకర్యం వుంది. సన్నకారు రైతులకు నీటి సౌకర్యం వున్న భూమి 32 శాతం అయితే పెద్ద కమతాలున్నవారి విషయంలో ఈ శాతం 42.70గా వుంది. ఈ గణాంకాలను పేదరికాన్ని తొలగించే వెలుగుపథకం దృక్కోణం నుంచి చూడాలి. దళితుల సగటు భూమి విస్తీర్ణం కేవలం 1.50 ఎకరం అయితే, అందులో నీటిసౌకర్యం గల భూమి కేవలం 0.33 ఎకరం మాత్రమే. ఈ దళిత రైతు తీరిక సమయంలో వ్యవసాయకూలీగా పనిచేసి అదనంగా కొంత సంపాదించినా, ఈ రైతు పేదరికపు రేఖపైకి ఎపుడు వెళతాడు?

మూడు జిల్లాలను వేర్వేరుగా పరిశీలించితే దళితుల సొంత కమతం విస్తీర్ణం అదిలాబాద్‌లో 1.83 ఎకరం, అనంతపురంలో 1.49 ఎకరం శ్రీకాకుళం జిల్లాలో 0.64 ఎకరం మాత్రమే. ఆయా జిల్లాల్లో మొత్తం సగటు వరుసగా 2.94, 3.25, 1.58 ఎకరాలుగా వుంది. అలాగే ఇతర తరగతుల భూకమతాల సగటు విస్తీర్ణం వరుసగా 2.94 ఎకరాలు, 3.25 ఎకరాలు, 1.58 ఎకరంగా వుంది. మొత్తం సగటుకు దళితులు ఎంతదూరంలో వున్నారో ఈ గణాంకాలు తెలియచేస్తున్నాయి.

భూకమతాల సెన్సస్

1995-96 వ్యవసాయభూముల సెన్సస్‌లో భూకమతాల గురించిన ఆసక్తికరమైన మరికొన్నివిషయాలున్నాయి. ఎస్.సి.లు మొత్తంజనాభాలో 15.93 శాతం. కాని, వారు వ్యవసాయం చేసే భూమి 7.42 శాతం మాత్రమే. ఒక హెక్టారుకు లోపు భూమి వున్న కమతాలు (సన్నకారు) మొత్తం కమతాల్లో 73.46 శాతం, ఒకటి నుంచి రెండు హెక్టార్లు (చిన్నకారు) కమతాలు 17.75 శాతం వున్నాయి. వాళ్ళలో పది హెక్టార్ల పైన వున్నవారి (పెద్ద) భూకమతాల శాతం 0.08 మాత్రమే. 1991లో జరిగిన వ్యవసాయ

సెన్సస్ నాటికన్నా, సన్నకారు రైతు కుటుంబాల కమతాల సంఖ్య ఎక్కువై, చిన్నరైతుల సంఖ్య తగ్గింది. అలాగే పెద్దరైతుల శాతం 0.17 నుంచి 0.08కి అంటే 50 శాతం మేరకు తగ్గిపోయాయి. మధ్యతరహా రైతుల భూకమతాల సంఖ్య కూడా 2.03 శాతం నుంచి 1.32 శాతానికి దిగజారింది. సెమీమీడియం, మీడియం తరహా పెద్ద భూకమతాల సంఖ్య 7.77 శాతం, 29.17 శాతం, 50 శాతం తగ్గిపోయాయి. పైన పేర్కొన్న రెండు సంవత్సరాల మధ్య సన్నకారు చిన్నరైతులు వ్యవసాయం చేస్తున్న భూమివిస్తీర్ణం పెరిగినా (66.89 శాతం) వారి కమతాల సంఖ్య 91.21 శాతం వున్న విషయం గమనిస్తే కమతాల విస్తీర్ణం తగ్గిన విషయం తేటతెల్లమవుతుంది. మరో గమనించాల్సిన విషయమేమంటే పదిహెక్టార్ల పైనవున్న కమతాల సగటు విస్తీర్ణం 16 నుంచి 19 హెక్టార్లకు పెరగగా, మధ్యతరహా, సెమీ- మీడియం, మీడియం తరహా పెద్ద భూకమతాల సంఖ్య 7.77 శాతం, 29.17 శాతం, 50 శాతం తగ్గిపోయాయి. పైన పేర్కొన్న రెండు సంవత్సరాల మధ్య సన్నకారు చిన్నరైతులు వ్యవసాయం చేస్తున్న భూమి విస్తీర్ణం పెరిగినా (66.89 శాతం) వారి కమతాల సంఖ్య 91.21శాతం వున్న విషయం గమనిస్తే కమతాల విస్తీర్ణం తగ్గిన విషయం తేటతెల్ల మవుతుంది. మరో గమనించాల్సిన విషయమేమంటే పదిహెక్టార్ల పైన వున్న కమతాలసగటువిస్తీర్ణం 16 నుంచి 19 హెక్టార్లకు పెరగగా, మధ్య తరహా, సెమీ-మీడియం, చిన్న కమతాల సగటు విస్తీర్ణం తగ్గింది. సన్నకారు రైతుల కమతాల విస్తీర్ణం కేవలం 2.44 శాతం పెరిగింది.

పూర్తిగానో, పాక్షికంగానో నీటిపారుదల సౌకర్యం కల భూకమతాల సంఖ్య 2.88 లక్షల నుండి 2.85 లక్షలకు తగ్గిపోయింది. నికరంగా సాగుచేసిన భూమి విస్తీర్ణం కూడా 3.92 లక్షల హెక్టార్ల నుంచి 3.70 లక్షల హెక్టార్లకు పడిపోయింది. మొత్తం దళితుల భూకమతాలు 10.94 లక్షలుంటే, వాటిలో సుమారు సగానికే నీటిసౌకర్యం అందుతుంది.

సర్వేచేసిన మూడు జిల్లాల్లో వె.బ.త., ఇతర తరగతుల వారికన్నా, ఎస్.సి.లు, ఎస్.టి.ల భూముల్లో తలసరి నికర ఆదాయం తక్కువగా వుంది. వారి భూముల ఉత్పాదకత ఏ పంటలు పండిస్తున్నారు, ఎంత ఎరువులు వాడుతున్నారనేదానిమీద ఆధారపడివుంటుంది. అలాగే మార్కెటింగ్, టెక్నాలజీ లాంటి అవకాశాలు వారికి ఎంతమేరకు అందుబాటులో వున్నాయనేది కూడా ఉత్పాదకతను నిర్ధారిస్తుంది. ఉత్పాదకత వారి ఆదాయాన్ని నిర్ణయిస్తుంది.

ఎస్.సి., ఎస్.టి. వ్యవసాయ కూలీలు

గణనీయమైన సంఖ్యలో ఎస్.సి.లు వ్యవసాయకూలీలుగానే జీవిస్తున్నారు. ముఖ్యంగా కరువుప్రాంతమైన అనంతపురంలో, వర్షాభావ పరిస్థితులేర్పడే శ్రీకాకుళం జిల్లాలో ఇది ఎక్కువగా కనపడుతుంది. స్థానికంగా వారి కూలీరేట్లు తక్కువగా వున్నాయి. వారికి పనిదొరికే దినాలు రుతుపవనాలు పరిస్థితులమీద ఆధారపడి వుంటుంది. పర్యవసానంగా వారి కూలీ ఆదాయం తక్కువగా వుంటుంది. అదిలాబాద్ కన్నా అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వలసలు పోవటం ఎక్కువగా వుంది. వ్యవసాయం ఒక్కటే వారు జీవించడానికి చాలదు కాబట్టి, ఇతర వ్యాపకాల్లోకి ఎక్కువగా వెళ్ళాల్సివస్తుంది. అసలు ఈ జిల్లాల ఆర్థికస్థాయే అంతంత మాత్రంగా వుంది. దీనికితోడు వారికి రుణసౌకర్యం ఇతరసహాయాలు అందకపోతే వారు మరింతగా అసమానత్వ సమస్యలకు గురవుతారు.

ఎస్‌సిలు వారి ఆదాయంలో4.3 శాతం వ్యవసాయకూలీలుగా, 12 శాతం వ్యవసాయం నుంచి, 37 శాతం వ్యవసాయేతర వ్యాపకాల నుంచి అయిదుశాతం ఇతరంగా పొందుతున్నారు. వివిధ జిల్లాల్లో వారి ఆదాయాలు స్థానిక పరిస్థితుల బట్టి, వారికున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులబట్టి మారుతుంటాయి. అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రధానంగా వ్యవసాయ కూలీలుగా పనిచేయటం వల్ల వచ్చే ఆదాయం ప్రధానమైతే, అదిలాబాద్‌లో వ్యవసాయేతర ఆదాయం ముఖ్యమైనదిగా వుంది. శ్రీకాకుళం జిల్లాలో ఎస్.సి.లు బాహ్య ఆర్థికవ్యవస్థ మీద ఆధారపడి వుండగా, అనంతపురం జిల్లాలో వలసలమీద ఆధారపడివున్నారు. వ్యవసాయం నుంచి వ్యవసాయేతర వ్యాపకాలవైపు ఎస్.సి.లు మళ్ళుతున్నారు.

అంటరానితనం

సర్వేచేసిన గ్రామాలన్నింటిలో (కొద్ది గ్రామాలు తప్ప) అస్పృశ్యత పాటిస్తున్నారు. వెనుకబడిన తరగతులు, ఇతర తరగతులవారు ఈ పని చేస్తున్నారు. రెండు గ్లాసులు, దేవాలయాల్లో ప్రవేశనిషేధం, పూరుమ్మడి బావులు, చెరువుల నుంచి నీరు తీసుకోనివ్వకపోవడం, చాకలి, మంగలి సేవల విషయంలో ఈ పాటింపు కొనసాగుతుంది. అశ్పృశ్యత పాటించటం వల్ల సామాజికంగా ఎస్.సి.లు దూరమవుతున్నారు. మానవ వనరుల సద్వినియోగానికి ఇది ప్రతిబంధకంగా ఏర్పడుతుంది. వారి జీవనాధారానికి అడ్డు ఏర్పడుతుంది. అశ్పృశ్యత కొన్ని ప్రాంతాల్లో తగ్గుతున్నా, అనంతపురం జిల్లాలో ఎక్కువగా వుంది. ఎస్.సి. బాలికలను యుక్తవయస్సులోనే స్థానిక దేవాలయాల్లో దేవతకు అంకితం చేయటం-దీనినే జోగిని/బస్విని/మాతమ్మ/దేవదాసి అంటారు. డబ్బున్న భూకామందులు వారితో తమ శారీరక వాంఛలను తీర్చుకుంటారు. ఇది సెక్స్ వర్కర్లను వ్యవస్థీకృతం చేయటమే. వీరికి పుట్టిన పిల్లలను కూడా వీరు అనుభవిస్తుంటారు. ఇటు జోగినీ వ్యవస్థ, అటు అంటరానితనం రెండూ వారి జీవితాలను బలికొంటున్నాయి. ఇది దారిద్ర్యాన్ని పెంచుతుంది. అనంతపురం జిల్లా విడ్పకల్ మండల్‌లో ఈ వ్యవస్థ కొనసాగుతుంది.

ఎటువంటి నైపుణ్యత లేని కుటుంబాలు ఇతర కులాలవారితో కన్నా ఎస్.సి. కుటుంబాల్లో ఎక్కువమంది వున్నారు. వారిలో పురుషులకన్నా స్త్రీలు అధికంగా వున్నారు. నైపుణ్యత విషయంలో

(తరువాయి భాగం 13వ పేజీలో)

శాసనసభ్యుని నెలసరి జీతభత్యాలు 40 వేలు!

— విద్యాభూషణ్

ప్రభుత్వ సమర్థతకు ఆర్థిక సుస్థిరత గీటురాయి. ఈ ఆర్థిక సుస్థిరత ప్రభుత్వం చేపడుతున్న ఆర్థిక ప్రగతి పథకాలపైన ఆధారపడివుంటుంది. ఈ ప్రగతి పథకాలు ఆయా రాష్ట్రాల్లో అందుబాటులోవున్న సహజవనరుల సద్వినియోగానికి అనువుగా రూపుదిద్దుకోవాల్సివుంటుంది. వనరుల వినియోగం, ఉత్పాదిత వ్యయం, అనుత్పాదిత వ్యయం వంటి విషయ వర్గీకరణలకు ప్రాధాన్యతను ఇవ్వగలిగిననాడే ఆర్థిక సుస్థిరత సాధ్యమౌతుంది. కాని నేటి సంస్కరణల నేపథ్యంలో ఈ ఆర్థిక సుస్థిరతను పక్కతోవ పట్టిస్తూ, 'అప్పులు' సంపాదించుకోవడమే ప్రభుత్వ సమర్థతగా చెప్పుకోవడం పరిపాటైంది. ఈ తెచ్చిన అప్పులను రుణదాత డిమాండ్లకు అనుకూలంగా ఒప్పందాలకు తలొగ్గి, ఆయా మొత్తాలను అనుత్పాదక రంగాల్లో వెచ్చించి, "అభివృద్ధి సాధించామహో" అని ఎలుగెత్తి అరవడం ప్రజల్ని మోసగించే యత్నం తప్ప మరొకటికాదు. 'అభివృద్ధి' అనే పదం అర్థాన్నే సమూలంగా మార్చేయడం జరుగుతుంది. తేటతెల్లంగా కన్పిస్తున్న తమ వైఫల్యాలను ఆత్మవిమర్శతో సరిచేసుకోవల్సిందిపోయి సద్విమర్శలను, కంటగింపువిమర్శలుగా కొట్టిపారేయటం ఓపరిపాటైంది.

సామాన్యంగా పాలనా ప్రక్రియకు పాలకవర్గం-ప్రభుత్వ ఉద్యోగులు నాణానికి బొమ్మా-బొరుసులాంటివారు. ఎందుకంటే, పాలకుల పథకాలకు ఆచరణను యిచ్చేది ఈ ఉద్యోగులే. మరి ఈ అనుసంధాన కర్తలపై పాలకులు కన్నెర్ర చేయటం యాదృచ్ఛికం అయితేకాదు. ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకే వ్యయమైపోతుందనే ఈ వాదనకు బలం చేకూర్చాలని పలు కమీషన్లను నియమించారు. మనరాష్ట్రంలో అయితే సుబ్రహ్మణ్యం కమిటీని నియమించి, ప్రభుత్వరంగ సంస్థల్లో ఓ నాలుగైదు సంస్థలు మినహా మిగతావన్నీ అసమర్థంగానే నడుస్తున్నాయని చెప్పించుకున్నారు. ఇలాగే మరో గంగోపాధ్యాయ కమిటీ ప్రభుత్వ శాఖల పనితీరును అధ్యయనం చేసి, అవసరాన్ని మించిన సిబ్బంది వున్నారని, కొన్ని శాఖలనైతే రద్దుచేసెయ్యవచ్చునీ సూచించి తమ ప్రభుభక్తిని చెప్పుకుంది. ఈ సూచన మొత్తంగా ఉపాధికల్పన ప్రక్రియకే మోకాలడ్డి నట్టయింది. దీనిఫలితంగానే నేటికీ భర్తీకాని వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు సంవత్సరాల తరబడి నిరుద్యోగుల ఆందోళనలు కడకు ఉద్యోగుల భర్తీలకు కోర్టులు సైతం జోక్యం చేసుకోవలసిన పరిస్థితులు ఉత్పన్నమైనాయి. కోర్టు ఉత్తర్వులను ఈ ప్రభుత్వాలు గౌరవించకున్నా, న్యాయమూర్తులకు అడగందే వారి వేతన సవరణలు, అధునాతన గృహ వసతులు, వాహన సౌకర్యాలు కల్పించడమూ రాజకీయంలో భాగమే. ఎందుకంటే, ఏళ్ళతరబడి ప్రభుత్వఉద్యోగుల వేతన సవరణలు చేపట్టకున్నా, కరువుభత్యాలను విడుదల చేయ కున్నా, న్యాయవ్యవస్థ ఉద్యోగుల వేతనసవరణలనుమాత్రంప్రభుత్వం వారు అడగకున్నా ప్రకటించడం జరుగుతుంది. పింఛనుదార్ల కరువుభత్యాన్ని కొన్నేళ్ళుగా ప్రభుత్వం పెంచని పరిస్థితీ వుంది.

సంస్కరణల ఫలితంగా ఉపాధికల్పన అడుగంటిపోయిన సంగతి తెలిసిందే. మరీ ప్రభుత్వాల అభివృద్ధి అమలుకోసం చేపడుతున్న ఉద్యోగ నియామకాలన్నీ కాంట్రాక్టు పద్ధతి ప్రకారమే జరుగుతున్నాయి. యింతటితో ఆగిపోకుండా, తమ వైఫల్యాలను అధికారులు లేదా ఉద్యోగులపై నెట్టేసే వంచనకు సైతం ఈ ప్రభుత్వాలు పాల్పడటం ఓ ఎత్తుగడ. పొట్టకూటికోసం ఉద్యోగం చేసుకుంటున్న వీరు ప్రజా సమక్షంలో నిధులు విడుదల చేయకపోవడం గురించి కానీ, నిధుల మళ్ళింపుల గురించి కానీ పెదవి విప్పలేరన్న ధీమాయే పాలకులకు అస్త్రమవుతుంది. ఇక ఆయా ఉద్యోగుల విధినిర్వహణల పట్ల దర్యాప్తులు, నోటీసులు లాంటి ప్రజాస్వామిక చర్యలు ఏముండవు. సస్పెన్షన్ల మౌఖిక ఆదేశాలే. ఇదే ప్రజాస్వామ్యం ఈ నేతల దృష్టిలో.

ఈ నేపథ్యంలో ప్రజలచేత, ప్రజల కొరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏమేరకు జీతభత్యాలను 'లూటీ' చేస్తున్నారో పరిశీలిద్దాం! కేవలం ప్రజాసేవ కోసమే ప్రజాప్రతినిధులమైనామన్న శాసనసభ్యుల వేతన ఆదాయాలను చట్టప్రకారమే పరికిస్తే వీరికి 'అసలు' కంటే 'కొసరు' ఎక్కువ. వీరి నెలసరి జీతం రూ. 2500-లు మాత్రమే. అదే రాయితీల విషయానికొస్తే కన్వేయెన్స్ అలవెన్స్ అయిదువేలు. జీతానికి రెట్టింపు. నియోజకవర్గ అలవెన్సు రూ. 1500/-, టెలిఫోన్ అలవెన్స్ 8000/-, అంటే జీతానికి మూడురెట్లు. సెక్యూరిటీఅలవెన్సు రూ. 15,000/-. 'ప్రజాస్వామ్యం' కదా! వాస్తవంగా అయితే వీరికిచ్చిన ప్రభుత్వ వసతుల మీద ఇంతకంటే అధిక మొత్తాలను అద్దెలరూపేణా పొందుతున్న దాఖలాలు వున్నాయి. ఈ మేరకే ప్రతి శాసనసభ్యుడూ నెలకు 40 వేల రూపాయల మేరకు జీతభత్యాలుగా పొందుతున్నారు. అంటే ఇది ఏ స్థాయి. విశ్వవిద్యాలయాల్లో రీసెర్చ్‌లు చేసిన ప్రొఫెసర్ల వేతనాల స్థాయికన్నా, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్.ల కన్నా అధికం.

ఇవికాకుండా, సభా సమావేశాలు జరిగితే రోజుకు రూ. 300- దినసరి రాయితీ (డైలీ అలవెన్స్). సాలుసరి ప్రస్తుత ప్రభుత్వ పక్షాన చూస్తే కనీసం 90 రోజులైనా సమావేశాలు జరుగుతాయి. సమావేశాల్లో ప్రజాసమస్యల పట్ల బాధ్యతయుతంగా పాల్గొనకున్నా అలవెన్సులను మాత్రం పొందడం ఖాయం. అంటే ఇవే సంవత్సరానికో 27 వేలు. వీరికి రైల్వేస్‌లో ఎ.సి.కోచుల్లో ప్రయాణ సౌకర్యం. శ్రీకాకుళం వంటి దూరప్రాంత ప్రతినిధులకు విమానయాన సౌకర్యం. సాలుసరి 30 వేల కిలోమీటర్ల ప్రయాణానికి రైల్వే కూపన్లు.

కూపన్లు తీసుకోకుంటే ఆ మేతకు డబ్బులు తీసేసుకునే వెసులుబాటు వుంది. ఇక ఆర్.టి.సి. విషయానికొస్తే, వీరు ఏకంగా ఆ సంస్థకి అల్లుళ్ళే. ఓ నౌకరుతో సహా వీరిష్టం వచ్చినట్లు ప్రయాణంచెయ్యవచ్చు. ఇక ఆరోగ్య వసతులకు వస్తే దేశంలోనే కాదు విదేశాల్లో సైతం వీరు వైద్యం చేయించుకోవచ్చు. నెలకో మూడువేల రూపాయల మేరకు మందులను పొందవచ్చు. ఇంతటితో అయిపోలే. ఎన్నికైన ప్రతిసారీ కారు కొనుక్కునేందుకు రెండున్నర లక్షల మేరకు స్వల్పవడ్డీ రుణవసతి. సభ్యునిగా వున్నకాలంలో 16 వేల నుండి పట్టికల వరకూ విదేశీ ద్రవ్యాన్ని విదేశీ యానాలకు వినియోగించుకోవచ్చు. ఇవన్నీ కాకుండా మరో వసతి. అదేంటంటే, మనది హైటెక్ పాలనకదా! పర్సనల్ కంప్యూటర్ పేరిట ఓ 89 వేలు పొందితే ఇందులో 17,500 రూ.లే చెల్లించాల్సింది. మిగతా మొత్తం ప్రభుత్వ సబ్సిడీయే. శాసనసభ్యుల పిల్లలకు, మనవళ్ళకు మంచి వెసులుబాటు.

ఇక ఈ మొత్తాలను సాలుసరిగా లెక్కగడితే మొత్తం 294 మంది శాసనసభ్యుల్లో 37 మంది మంత్రివర్యులను మినహాయిస్తే మిగతా 257 మంది శాసనసభ్యులకు నెలకు రూ. 1,02,80,000- జీత భత్యాలు. సాలీనా రూ. 12,33,60,000/- వీటికి 37మంది మంత్రి వర్యుల సంవత్సర జీతభత్యాలు రూ. 3,84,93,095/- కలిపితే 1,60,23,000- వెరసి రూ. 18,84,60,000/-లు. ఇతర రవాణా వ్యయాలను జతచేస్తే ఏమేరకు అవుతుందో చూడండి. ఇది సంవత్స రానికే. పదవీకాలం ఐదేళ్ళకు చూస్తే అది వందకోట్ల పైచిలుకే!

ఒక్కో శాసనసభ్యుడు పొందుతున్న నెలసరిజీతం, డిగ్రీ చదువుకుని ఉపాధ్యాయ శిక్షణను పొందిన 34 మంది మేధావుల ప్రారంభపు జీతానికి సమానం. ప్రభుత్వం నియమిస్తున్న కాంట్రాక్టు నియామకాలకు 'పింఛను' సౌకర్యం లేకున్నా శాసనసభ్యులకైతే ఆ వెలుసుబాటూ వుంది. ప్రజాసేవ చేసి వారు పొందింది, మిగుల్చుకుందీ ఏమీ వుండదనే. దీన్నికూడా సవరించే యోచనలో వుందీ ప్రభుత్వం.

ప్రజాసేవ పేరిట ప్రజాధనాన్ని ఇంతింత మొత్తాల్లో ప్రజాప్రతినిధులు వినియోగించుకుంటూ వుంటే, సేవారంగంలో ఉపాధి పేరిట పనిచేసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు పొందుతుంది ఏమాత్రం? ఇక కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ ప్రభుత్వం ఇస్తుంది ఏ మూలకు? మరీ పరిస్థితులు వీరిని గౌరవప్రదంగా, ఆదర్శప్రాయంగా, నీతి- నిజాయితీలతో పనిచేసుకోనిస్తాయా?

ఆదర్శాలు వల్లించినంత మాత్రానకాదు. ఆచరణలో చూపగలిగి నపుడే వాటికి అర్థం-పరమార్థం. ప్రజాధన సద్వినియోగాన్ని స్వార్థపర చింతనను ఆవలకు నెట్టేసి పరిశీలిస్తే నేటి ఆర్థిక అరాచకత్వానికి ఎవరు కారణం అన్నది తేటతెల్లం అవుతుంది. ఇందుకు 'ఆత్మవిమర్శ' పునాది. మనుషులు మారడానికి, మారాయనడానికి 'మూలం' అదే.

2002-03 ఆర్థిక సంవత్సరంలో మంత్రులు పొందిన జీతభత్యాలు

1.	చంద్రబాబునాయుడు	07,08,305
2.	అశోక్ గజపతి	10,83,000
3.	అయ్యన్నపాత్రుడు	09,92,007
4.	చంద్రమోహన్‌రెడ్డి ఎస్.	09,70,909
5.	పి. చంద్రశేఖర్	11,32,622
6.	టి. దేవేందర్ గౌడ్	06,63,746
7.	ఎన్.ఎం.డి. ఫరూఖ్	10,48,116
8.	డి. గోపాలకృష్ణారెడ్డి	09,87,766
9.	ఎన్. జనార్ధన్ రెడ్డి	11,57,956
10.	టి.వి. మోహనరెడ్డి	8,35,103
11.	తుమ్మల నాగేశ్వరరావు	10,98,715
12.	కె.ఇ. ప్రభాకర్	10,57,339
13.	జె.ఆర్. పుష్పరాజ్	07,60,714
14.	చిక్కాల రామచంద్రారావు	09,46,847
15.	యనమల రామకృష్ణుడు	12,89,122
16.	పి. రామసుబ్బారెడ్డి	09,32,998
17.	తమ్మినేని సీతారామ్	10,33,146
18.	కోడెల శివప్రసాద్‌రావు	08,78,772
19.	దండు శివరామరాజు	12,13,332
20.	వడ్డే శోభనాద్రీశ్వరరావు	11,06,112
21.	కడియం శ్రీహరి	12,08,081
22.	టి. శ్రీనివాస యాదవ్	10,72,857
23.	కె. సుబ్బారాయుడు	10,84,657
24.	ఎం. వేంకటేశ్వరరావు	14,40,837
25.	కె. విద్యాధరరావు	16,53,502
26.	కె. విజయరామారావు	14,76,919
27.	ఎ. ఉమామాధవరెడ్డి	08,73,540
28.	డి. ఆంజనేయులు	10,98,086
29.	పణల భూమన్న	09,68,313
30.	ఎం. దామోదరరెడ్డి	12,85,468
31.	నిమ్మల కిష్టప్ప	09,62,980
32.	ఎం. మణికుమారి	09,45,141
33.	ఎన్. నరసింహారావు	10,12,559
34.	పి. నారాయణస్వామి	10,07,147
35.	పి. రాములు	11,47,307
36.	ఎస్. సరస్వతి	09,02,339
37.	సి. ముత్యం రెడ్డి	04,49,260

(ఏప్రిల్ 05, 2003 నాటి ఆంధ్రభూమి దినపత్రిక వార్తాకథనం ఆధారంగా)

చర్చలు జరపక పోవడం ప్రభుత్వ చారిత్రక తప్పిదం

— ఇప్ప వీరారెడ్డి

నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రజలు వత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. నక్సలైట్లపై ప్రజలు ఆ విధమైన వత్తిడి తెస్తారో లేదో తెలియదు గాని, యావత్ రాష్ట్ర ప్రజలు నక్సల్స్‌తో బేషరతు చర్చలు జరపాలని తీసుకువచ్చిన వత్తిడిని మాత్రం ప్రభుత్వం బేఖాతరు చేస్తుంది. అటువంటప్పుడు ముఖ్యమంత్రి జనజీవన స్రవంతిలో కలిసేలా నక్సల్స్‌పై వత్తిడి తేవాలని పిలుపునెలా ఇవ్వగలరు? నిజానికి చర్చలు జరిపేందుకు ప్రభుత్వంపై వత్తిడి తేవాలని విఫలమైన గత చర్చల సందర్భంగా పీపుల్స్‌వార్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. చర్చల వైఫల్యంలో ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదుల నుండి తీవ్ర విమర్శలనెదుర్కొంటున్న ప్రభుత్వంపై ఆనాటినుంటి నేటివరకు చర్చల ఆవశ్యకతపై నిరంతర వత్తిడి పెరుగుతూనే ఉంది.

ఒకవైపు వార్‌తో చర్చలు జరిపేందుకు బీహార్ ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. మరొకవైపు మాజీ సి.బి.ఐ. డైరెక్టర్ కార్తికేయన్, మాజీ కేంద్రప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి ప్రస్తుతం నాగా సమస్య పరిష్కార బాధ్యతలు పర్యవేక్షిస్తున్న పద్మనాభయ్యలతోపాటు, ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెసు, వామపక్షాలు, తెలుగుదేశం భాగస్వామ్య మిత్రపక్షమైన భారతీయ జనతాపార్టీలతో సహా యావత్ రాష్ట్ర ప్రజానీకం, పలువురు ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని చర్చలకై డిమాండ్ చేస్తున్నారు. ఈ మొత్తం పరిస్థితికి తెలుగుదేశం ప్రభుత్వం పూచికపుల్లంత విలువను కూడా ఇవ్వడం లేదంటే, ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ప్రజాస్వామ్య విలువలపై దానికిగల గౌరవం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. పైగా ఎంత అప్రతిష్టపాలైనా, ఎవరేం చెప్పినా అవసరం లేదనుకునే వైఖరితో అణచివేతచర్యలు ఆరంభించపూనుకోవడం దాని అనాగరిక పాలనా విధానానికి చిహ్నం. ఈ విధంగా చర్చలంటేనే తీవ్ర విముఖతను ప్రదర్శించడానికి గల కారణం ఏమిటి?

చర్చలంటూ ప్రారంభమైతే తదనంతరం కుదుర్చుకునే ఒప్పందాల మేరకు మార్చుకోవలసిన తన రాజకీయ విధానాలద్వారా రాబోయే ఫలితాలను ముందే అననుకూలంగా ఊహించుకుంటున్న ధోరణే ప్రభుత్వానికి చర్చలంటే భయపడడానికి కారణం అవుతుంది. అందువల్లనే, చర్చలుజరపడం ద్వారా తమ ఉద్యమ పద్ధతులు కొన్ని మార్చుకోవడానికి వార్ సిద్ధపడుతున్నా ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదు. వార్ మార్చుకోబోయే విధానం ద్వారా తమకు కలిగే ప్రయోజనంకంటే, తనరాజకీయవిధానాన్ని మార్చుకోవడం వల్లవార్‌కు జరిగే ప్రయోజనమే ఎక్కువని ప్రభుత్వం భావిస్తుంది. అంతకంటేముందు ప్రభుత్వం తన రాజకీయ విధానాన్ని మార్చుకోవడానికే ఇష్టపడడం లేదనేది వేరే విషయం. రాజకీయ విధానమంటూ మార్చుకోవాలంటే కోట్లాదిమంది జనాల రోజువారి బ్రతుకుల్ని తీవ్ర అశాంతికి, అస్థిరతకు, అభద్రతకు గురిచేస్తూ, ఆకలి, దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం, ఆత్మహత్యలు లాంటి దుష్ఫలితాలకు కారణమైతున్న సంస్కరణల రథచక్రాన్ని వెనక్కి తిప్పాల్సివుంటుంది. బాబు పరిపాలనా విధానానికి అత్యంత కీలకమైనది ఈ అంశం. ప్రజల జీవితాలు తీవ్ర సంక్షోభంలో పడిపోతున్నా ఏమాత్రం లెక్కచేయకుండా సంపన్నవర్గాల సంక్షేమాన్ని సుస్థిరపరిచే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలల కలబోత రూపమైన సంస్కరణలను నిరాటంకంగా కొనసాగిస్తూ ప్రపంచ పెట్టుబడిదారుల, ప్రపంచ బ్యాంకు పెద్దల, సంపన్నదేశ ప్రభుత్వాధి నేతలు ఎందరిచేతనో 'సెహభాష్' అనిపించుకుంటున్న చంద్రబాబు నాయుడు తన ఈ రాజకీయ విధానాన్ని చర్చల సందర్భంగా మార్చుకోవల్సివస్తే అందుకు చర్చలనైనా తిరస్కరిస్తాడేమో కాని, సంస్కరణల రాజకీయ విధానాన్ని మార్చుకోవడానికి ఇష్టపడకపోవచ్చు. చర్చలపట్ల విముఖత కలిగివుండడానికి ఇదే ప్రధానమైన కారణం.

ఈ విధంగా చర్చలు ముగిశాక ఇరువర్గాల మధ్య కుదిరే ఒప్పందాలు తద్వారా ఒనగూరే ఫలితాలు తమకు ఎంతమాత్రం వ్యతిరేకంగా లేని, పూర్తిగా తనకు మాత్రమే అనుకూలంగా ఉండాలనే అభిప్రాయం ప్రభుత్వంలో బలపడిపోయింది. పూర్తిగా అసమంజసమైన ఈ విధమైన అభిప్రాయాన్నేర్పచుకున్న ప్రభుత్వానికి చర్చలంటే ఎవరి అస్థిత్వానికి భంగం కలగనిరీతిలో తమ పూర్వపు రాజకీయ విధానాలను, పద్ధతులను కొంత కొంత వదులుకోవడమో లేదా మార్చుకోవడమో తప్పనిసరిగా జరగాల్సిన ఆమోదయోగ్యమైన పూర్తి హృదయపూర్వక ఒప్పందమే ననే విషయం తెలియందేం కాదు. అది తెలుసును గనకనే చర్చలంటే ప్రభుత్వం వెనుకంజ వేస్తుంది.

ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వం దృష్టిలో చర్చలంటే పీపుల్స్ వార్ తుపాకులు అప్పజెప్పడం ద్వారా ప్రారంభించే లొంగుబాటు సంభాషణలుగా మాత్రమే ఉండాలని కోరుకుంటుందన్నది స్పష్టంగా అర్థం అవుతుంది. అలిపిరి తదనంతరం రెండోసారి తిరుపతి వెళ్ళి నగరానికొచ్చిన ముఖ్యమంత్రి పత్రికలవారితో చర్చల ప్రస్తావనను గూర్చి 'చర్చలకుముందు తుపాకులు వదిలేస్తారా, చర్చల తదనంతరం జనజీవన స్రవంతిలో కలుస్తారా?' అంటూ నక్సల్స్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ అంతరంగఉద్దేశాన్ని బయటపెడు తున్నాయి. మొత్తంమీద చర్చలు జరపడం అన్నది ప్రభుత్వానికి తన రాజకీయ లక్ష్యంతో ముడిపడిఉన్నటువంటి సమస్య. రాజకీయ లక్ష్యం ప్రజా సంక్షేమమే అయితే చర్చలు జరపడం, సంపన్నుల సంక్షేమం అయితే అణచివేయడమన్నది ప్రభుత్వ విధానానికి అనివార్యం అవుతుంది. దేనికి ప్రాధాన్యత నివ్వాలన్నది ప్రభుత్వం నిర్ణయించుకోవలసిన (నిజానికి ఇది పూర్తిగా ప్రజలు నిర్ణయించాల్సిన సమస్య) అంశం.

జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారులు దోచుకోవడానికి, దానిలో తాముకూడా దళారీపాత్రను అవలంబిస్తూ అందినకాడికి అక్రమార్జన ద్వారా ఆస్తులు పోగేసుకోవడానికి అవకాశాలను రూపొందించుకోవడమే రాజకీయాలలక్ష్యం అయినప్పుడు అణచివేత దాని విధానం అవుతుంది. దానితో నియంతృత్వంగా మారే ప్రభుత్వ రూపానికి అణచివేతస్వభావం అనివార్యంగా అంతర్భాగమవుతుంది.

ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థంలో అణచివేయడం అన్నది అస్సలు నరిపడని మాటేకాదు, వినపడనిమాట కూడా. ప్రజాస్వామ్యానికి చర్చలే ప్రాణం. ప్రజల సమస్యలను పరిష్కరించ టంలో విఫలమైన (ఇష్టంలేని) ప్రభుత్వాలే అణచివేతను ఆసరాగా చేసుకుంటాయి. మూలాల్లోకి వెళ్ళి విశ్లేషించ దానికి బద్ధకించేవాళ్ళకు, పైపైనే ఆలోచించడానికి అలవాటుపడ్డ వాళ్ళకు మాత్రమే అణచివేత విధానం కొన్ని సందర్భాలకు సరైందని అనిపించవచ్చు. కాని మూలాన్ని పట్టుకోగలిగితే తేలేవి సామాజికార్థిక కారణాలే. ఉపరితలంలో తలెత్తే పేదరికం, దొంగతనం, వ్యభిచారం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, భిక్షాటనం, అనారోగ్యం, అప్పులభారం, ఆకలి, ఆత్మహత్యలు లాంటి ఫలితా లన్నింటికి సామాజికార్థిక కారణాలే కేంద్రం. వాటి పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలను అణచివేయడం ప్రజాస్వామ్యంతో అర్థరహితం, అవివేకం.

అణచివేత తాత్కాలిక ఉపశమనం అయితే సమస్య సమసి పోవడం శాశ్వత ఫలితంగా ఉంటుంది. ఒకానొక ఉద్యమాన్ని తాత్కాలిక ప్రయోజనాన్ని ఆశించి మాత్రమే పోలీసు బలప్రయోగ చర్యలతో అణచివేయడం వల్ల ఆ ఉద్యమం వెంటనేనో, మరికొంత కాలానికో, ఎక్కడనో, లేదా అణచివేయబడ్డచోటనో తిరిగి తిరిగి తలెత్తడమన్నది ఖచ్చితంగా జరిగే పరిణామం. ఎంతకాదనుకున్నా ఇది పాలకులు మాట్లాడుతున్న తమదైన ప్రజాస్వామ్యాన్ని తరచూ అస్థిరపరుస్తూ వారితరహా జనరంజకమైన పరిపాలనా విధానాన్ని ఆటంకపరుస్తూనే ఉంటుంది.

జనజీవన స్రవంతిలోకి రమ్మని పదేపదే పిలుపులిస్తున్న ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవలసిన ఒక విషయాన్ని గుర్తుచేయాల్సి వుంది. జనజీవన స్రవంతిలో కలిసే ఉద్దేశం ఉందో లేదో తెలియదు గాని, స్వయంగా కాల్పుల విరమణను ప్రకటించి నిజాయితీతో అమలు జరుపుతూ చర్చలవేదికమీదికి రాబోయిన పీపుల్స్‌వార్ మనోగతాన్ని పసిగట్టలేకపోవడం ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదం. అది తెలియక చేసిన తప్పిదమే అయితే సరిదిద్దుకునే అవకాశం ఇంకా వుంది. తమంతతాముగా కాల్పుల విరమణ ప్రకటనతో చర్చల ప్రతిపాదనను ముందుకుతెస్తే తానెప్పటికైనా సిద్ధమేననే నాటి వార్ ప్రకటనతో చర్చలకు అవకాశాలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరొకమారు చర్చలకు అవకాశం వచ్చిన ప్రస్తుత వాతావరణాన్ని సద్వినియోగపరుచుకోవడం ప్రభుత్వవిజ్ఞతకు ప్రమాణంగా నిలుస్తుంది. ఆ దిశలో సానుకూలంగా స్పందించడం, స్పందించకపోవడం, తద్వారా లభించే కీర్తికైనా అపకీర్తికైనా ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. ○

చందాదారులకు విజ్ఞప్తి

మొదటి సంచిక నుంచి చందాదారులుగా చేరినవారి చందా డిసెంబరు నెలాఖరుతో ముగుస్తుంది. వారు అంతా తిరిగి చందాదారులుగా చేరి వార్షికచందా 120 రూ.లను మనీఆర్డరు లేదా డ్రాఫ్టురూపంలో పంపడం ద్వారా మా ఈ కృషికి మీ సహకారాన్ని అందించాలని కోరుతున్నాం.

అన్ని రంగాలలోను వెనుకబడిన ఆంధ్రప్రదేశ్

— అపర్ణ

ప్రజలే నా దేవుళ్ళు వారి అభ్యున్నతి కోసమే అహర్నిశలు కృషిచేస్తాను. ఎన్నికలపుడే రాజకీయాలు మాట్లాడుతాను అని చాటిచెప్పే మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో రాష్ట్ర అభివృద్ధి అటుంచి స్కాముల కుంభకోణంలో పీకలవరకు కూరుకు పోయినట్లు కానవస్తోంది ఇటీవలకాలంలో. సహకార అర్బన్ బ్యాంకుల కుంభకోణం, పనికి ఆహారం పథకంలో కుంభకోణం, భూకబ్జా కుంభకోణం, టైమర్ల కుంభకోణం, నకిలీ స్టాంపుల కుంభకోణం లాంటివి ఎన్నో ఎన్నెన్నో ఒకటి తరువాత ఒకటి వెలుగులోకి వస్తుంటే తెలుగుదేశం ప్రభుత్వ పునాదులు కృంగిపోతున్నట్లు కానవస్తోంది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు హవా తగ్గే అవకాశం కూడా లేకపోలేదు. పార్టీలో ఎవరు అవినీతికి పాల్పడినా అది మొత్తం పార్టీకే పెనుముప్పుగా సంభవించే అవకాశముంది. అందునా ఎన్నికలు రాబోతున్న ఈ తరుణంలో. చంద్రబాబు ఎంత సుడిగాలి పర్యటన చేసినా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించినా ఇటీవల జరిగిన కార్వాన్ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ మద్దతు ఇచ్చిన భారతీయ జనతాపార్టీ అభ్యర్థి ఓడిపోవటమే ముఖ్యమైన తార్కాణం.

ఎన్.టి.ఆర్. మంత్రివర్గంలో రెవెన్యూ ఆర్థికమంత్రిగా వున్న చంద్రబాబు ఎన్.టి.ఆర్.ను త్రోసిరాజని ప్రశాంత ఘాతుక విప్లవం ద్వారా 1 సెప్టెంబరు 1995న రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించి రాష్ట్రాభివృద్ధికి అనేక అనూహ్యమైన ప్రజాకర్షక పథకాలు చేపట్టినా "జన్మభూమి" కార్యక్రమం జనవరి 1997లో మొదలుపెట్టి ఇప్పటివరకు 19 విడతలు ఈ కార్యక్రమం నిర్వహించినా ఇటీవల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఈ పథకంలో డిస్టార్షన్స్ ఉన్నట్లు కానవస్తోంది. రాష్ట్రంలో నూటికి దాదాపు 70 శాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయమే జీవనాధారంగా కాలం గడుపుతూవున్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు గ్రామీణాభి వృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చాటిచెప్పే చంద్రబాబు ప్రభుత్వ హయాంలో తొమ్మిదవ ప్రణాళికా (1997-2002) కాలంలో రూ.1922 కోట్లు పరివ్యయం ఆమోదించగా అసలు చేసిన ఖర్చు రూ.1387 కోట్లు అనగా 72 శాతమే ఖర్చుచేసినట్లు కానవస్తోంది. దీన్నిబట్టి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ఎంత కృషిచేస్తోందో తేటతెల్లమవుతోంది. అనగా మొసలికన్నీరు కార్చటం తప్ప ఏముంది?

నీటిపారుదల-వరద నివారణకు ప్రాధాన్యం ఇస్తున్నాం అని చెప్పే ఈ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో రూ.6007 కోట్లు కేటాయింపు ఆమోదించగా అసలు ఈ పద్దుకింద చేసిన ఖర్చు రూ.5944 కోట్లు. రాష్ట్రంలో స్థూల సాగుబడి విస్తీర్ణం 1998-99 సంవత్సరంలో 60.92 లక్షల హెక్టార్లు వుండగా 2001-02 సంవత్సరంలో 55.49 లక్షల హెక్టార్లకు తగ్గిపోయిందంటే రాష్ట్రప్రభుత్వం వ్యవసాయానికి సాగునీరు సరఫరా చేయటంలో విఫలమైనట్లుగా కానవస్తోంది. దీనివల్ల రైతుల ఆత్మహత్యలు, ఆంధ్రకు అన్నపూర్ణ అయిన కృష్ణా డెల్టాలో సాగునీరు సరఫరా చేయవలసిందిగా రైతుల, ప్రజా ప్రతినిధుల ఆందోళనలు పెరిగిపోతున్నాయి. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలో రాజోలిబండ మళ్ళింపు పథకం ఆందోళన, రాయలసీమ అనావృష్టి, కరువుకోరల్లో సతమతమవుతున్నా, జలజగడాలతో రాష్ట్రం అట్టుడికిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా కనవస్తోంది. ఈ సమస్యను రాజకీయ సమస్యగా తీసుకోకుండా మూడు ప్రాంతాల వ్యవసాయరంగం అభివృద్ధికి సాంకేతికపరమైన పరిష్కారం కనుగొనాలి. గోదావరి, కృష్ణానీటిని వృధా కానీయకుండా వుండేందుకు ఈ రెండునదుల అనుసంధానికి కృషిచేయాలి. రాజకీయాలకు అతీతంగా సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకొని, పరిశ్రమలరంగంలో తొమ్మిదవ ప్రణాళికా కాలంలో రూ.962 కోట్లు కేటాయింపు ఆమోదించగా పూర్తిగా ఖర్చుపెట్టలేకపోయినట్లు ప్రభుత్వ గణాంకాలే చాటిచెపుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యమే దీనికి ప్రధాన కారణం కావచ్చు. సాంఘిక సర్వీసులకు ప్రాధాన్యమిస్తున్నాం అని చాటిచెప్పే రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికలో ఈ పద్దుకింద రూ.6460 కోట్లు కేటాయించగా ఇందులో 91 శాతమే ఖర్చుపెట్టగలిగింది.

పదవ పంచవర్ష ప్రణాళిక (2002-2007) మొదలై ఒక సంవత్సరంపైగా గడిచినా ఇప్పటివరకు ఈ ప్రణాళికకు సంబంధించి ముసాయిదా అధికార పత్రమే ఇంకా అందుబాటులో లేదు. మరి రాష్ట్రప్రభుత్వం ఎప్పుడు ప్రజలకు అందుబాటులోకి తెస్తుంది? అసలు వెలుగుచూస్తుందా లేదా? కాని కేంద్ర ప్రణాళికా సంఘం విడుదల చేసిన పదవ పంచవర్ష ప్రణాళికా సంపుటి-1లో రంగాలవారీగా రాష్ట్రాలకు సంబంధించి అభివృద్ధి లక్ష్యాలు ఇవ్వటం జరిగింది. వ్యవసాయరంగంలో దేశం మొత్తంమీద 4 శాతం అభివృద్ధి లక్ష్యం కాగా పశ్చిమబెంగాల్‌లో అభివృద్ధి లక్ష్యం 5.09 శాతం, కర్ణాటకలో 4.99 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 4.67 శాతం, హిమాచల్‌ప్రదేశ్‌లో 4.55 శాతం, రాజస్థాన్‌లో 4.50 శాతం వుండగా ఆంధ్రప్రదేశ్ 3.05 శాతంతో 17వ స్థానంలో వుంది.

పరిశ్రమల రంగంలో చూస్తే దేశం మొత్తంమీద పదవ పంచవర్ష ప్రణాళికలో అభివృద్ధి లక్ష్యం 8.9 శాతం కాగా హిమాచల్‌ప్రదేశ్‌లో 12.49 శాతం, గుజరాత్‌లో 12.23 శాతం, కర్ణాటకలో 11.34 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 11.05 శాతం,

రాజస్తాన్‌లో 10.06 శాతం, హర్యానాలో 9.56 శాతం, త్రిపురలో 9.37 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 9.15 శాతం వుండగా ఆంధ్రప్రదేశ్ 8.01 శాతం లక్ష్యంతో 11వ స్థానంలో వుంది.

సర్వీసుల రంగంలో దేశం మొత్తంమీద అభివృద్ధిరేటు లక్ష్యం పదవ పంచవర్ష ప్రణాళికలో 9.4 శాతం వుండగా కర్ణాటకలో 12.51 శాతం, పశ్చిమబెంగాల్‌లో 10.76 శాతం, గుజరాత్‌లో 10.44 శాతం, సిక్కింలో 10.36 శాతం, హర్యానాలో 10.33 శాతం, తమిళనాడులో 9.77 శాతం, రాజస్తాన్‌లో 9.63 శాతం, వుండగా మనరాష్ట్రం 8.39 శాతం లక్ష్యంతో 11వ స్థానంలోవుంది.

మొత్తంమీద పదవ పంచవర్ష ప్రణాళికలో స్థూల జాతీయ ఉత్పత్తిలో 8 శాతం అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయించగా రాష్ట్రాలవారీగా చూస్తే స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో అభివృద్ధిరేటు లక్ష్యం గుజరాత్‌లో 10.2 శాతం వుండగా కర్ణాటకలో 10.1 శాతం, హిమాచల్‌ప్రదేశ్‌లో 8.9 శాతం, పశ్చిమబెంగాల్‌లో 8.8 శాతం, రాజస్థాన్‌లో 8.3 శాతం, తమిళనాడులో 8 శాతం, హర్యానా, సిక్కిం రాష్ట్రాలలో 7.9 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 7.6 శాతం, వుండగా ఆంధ్రప్రదేశ్ 6.8 శాతం లక్ష్యంతో 12వ స్థానంలో వుంది.

ప్రతి ప్రణాళికలో పేదరిక నిర్మూలన కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా వుంది. మన రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు "వెలుగు" కార్యక్రమం అమలుచేయటం జరుగుతోంది. కేంద్ర ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం 2006-07 సంవత్సరంలో రాష్ట్రం మొత్తంమీద 8.49 శాతం పేదరికం కింద మగ్గుతున్న జనాభా వుంటారని అంచనా. రాష్ట్రాలవారీగా చూస్తే గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, పంజాబు, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు మన రాష్ట్రం కంటే మెరుగ్గా పేదరిక నిర్మూలనకు కృషిచేస్తున్నట్లు గణాంకాలు వెల్లడవుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యం కింద మగ్గుతున్న జనాభా 2006-07 సంవత్సరంలో మనరాష్ట్రంలో 4.58 శాతం వుంటారని అంచనా. కేరళ, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు మనకంటే ముందంజలోనే వున్నాయి.

పట్టణ ప్రాంతాల్లో పేదరికం కింద మగ్గుతున్న జనాభా 2006- 07 సంవత్సరంలో మనరాష్ట్రంలో 18.99 శాతం వుంటారని అంచనా కాగా గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, అస్సాం, కర్ణాటక, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్తాన్ మనకంటే మెరుగుగా వున్నట్లు గమనించవచ్చును.

అక్షరాస్యత 2001 జనాభా లెక్కల ప్రకారం దేశం మొత్తంమీద 65.49 శాతం వుండగా మనరాష్ట్రం 28వ స్థానంలో వుంది. ప్రధాన పనివారికి సంబంధించి వర్క్ ఫోర్స్ గ్రోత్ దేశం మొత్తంమీద 0.81 శాతం వుండగా మనరాష్ట్రం 0.19 దేశంలో 12వ స్థానంలో వుంది.

పై విశ్లేషణ బట్టి తేలేదేమిటంటే మనరాష్ట్రం ప్రణాళికా పథంలో వెనుకంజలోనే వున్నట్లుగా గోచరిస్తోంది. అవినీతి, కుంభకోణాల్లో ఇరుక్కుని, తమ ప్రభుత్వం పారదర్శకతకు అధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పే చంద్రబాబు జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి ఒక శ్వేతపత్రం విడుదల చేస్తే ప్రజలకు, రాజకీయ పార్టీలకు అపోహలు తొలగిపోయే అవకాశం వుంటుంది. ప్రణాళికా వికేంద్రీకరణకు ప్రాధాన్యమిచ్చి మూడుప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రాంతీయ బోర్డులను ఏర్పాటుచేసి వివిధ రంగాలలో నిష్ణాతులైనవారిని సభ్యులుగా నియమించి వారి సలహాలను తీసుకొని అధ్యయనం చేసి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషిచేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అనుత్పాదక వ్యయాన్ని తగ్గించి అభివృద్ధిమీద దృష్టి సారించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ప్రాంతాలవారీగా గ్రామీణ-పట్టణ స్థూల ఆదాయ గణాంకాలు పశ్చిమ బెంగాల్‌లో మాదిరిగా మనరాష్ట్రంలో కూడా సంకలనం చేయగలగాలి. అపోహలు తొలగిపోవటానికి ఈ చర్య ఎంతైనా ఆవశ్యకం. ప్రాంతాలవారీగా బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు పారదర్శకంగా చూపిస్తే అన్ని రాజకీయ పార్టీలకు, అన్ని ప్రాంతాల ప్రజలకు అపోహలు తొలగిపోతాయి. ❍

(పట్టికల వివరాలను రెండు రెళ్ళు నాలుగులో చూడండి)

(7వ పేజీ తరువాయి)

విద్యకు దానికి ఏ సంబంధం లేదు. నైపుణ్యత సాంప్రదా యంగా కుటుంబాల్లో వస్తూంది. మొత్తం జనాభాలో అనారోగ్యంగా వున్నవారిలో ఎస్.సి.ల శాతం ఇతరుల కన్నా ఎక్కువగా వుంది. వారిలో కూడా స్త్రీలలో అనారోగ్యం ఎక్కువ శాతం. రోగం వస్తే మందూ, మాకూ వేసుకోకుండా వున్నవారిలో కూడా ఎస్.సి.లు ఎక్కువశాతం వున్నారు. ఏ రోగం వచ్చినా, ప్రైవేటు వైద్యుల దగ్గరకు పోవడమే ఎక్కువగా కనిపిస్తుంది. ఆర్థిక స్తోమత, వైద్య సదుపాయం అందుబాటులో లేకపోవడం, వైద్యం చాలా ఖర్చుతో కూడకున్న విషయం. వారి ఆరోగ్యానికి అవరోధాలుగా నిలిచాయి.

పురుడుపోసుకునేముందు వైద్యపరంగా తీసుకోవలసిన జాగ్రత్తల విషయంలో ప్రైవేటు వైద్యం కన్నా ప్రభుత్వాసుపత్రుల్లోనే సౌకర్యాలు అందుబాటులో వున్నాయి. అయినా ఎస్.సి.లలో ప్రతి రెండు కాన్పుల్లో ఒకటి అరక్షిత వాతావరణంలోనే జరుగుతుంది.

ఎస్‌సిల్లో 62 శాతంమందికుటుంబసంక్షేమపద్ధతులనుపాటిస్తు న్నారు. ఈ పద్ధతులను అనుసరించనివారు ఎక్కువమంది బిడ్డలు కావాలనుకోవటం, కొడుకుపుట్టాలనే కోరిక కారణాలుగావున్నాయి.

ప్రతి వెయ్యిమందిలో 41 మంది బిడ్డలు పుట్టిన 3 సం॥రాల లోపుగానే మరణిస్తున్నారు. ఈ సంఖ్య ఇతర తరగతుల్లో 29 మాత్రమే. అనారోగ్యాలే ఈ మరణాలకు ప్రధాన కారణం. ❍

తెలుగుదేశం ఎన్నికల ప్రణాళిక (1999)

తెలుగుదేశం ఆశయం - లక్ష్యం - విధానం

(ఎన్నికలముందు ప్రతిపార్టీ ఎన్నికల ప్రణాళిక విడుదల చేస్తుంది. ఇవి తెలుగుదేశంపార్టీ చేసిన వాగ్దానాలు. వీటిలో ఏవి ఎంతమేరకు నెరవేరాయో, ఏవి మీరు అనుభవిస్తున్నారో మీ జీవితాల్లో మీరే తొంగిచూసుకోండి. స్వీయానుభవం నేపథ్యంలో మీ హక్కును వినియోగించుకోండి. - సం)

అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అసమర్థ పరిపాలనతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్‌పార్టీకి ప్రత్యామ్నాయంగా తెలుగుదేశంపార్టీని స్థాపించి అక్షరక్రమంలోనేకాక అభివృద్ధిపథంలోసైతం ఆంధ్రప్రదేశ్‌ను అగ్రభాగాన నిలపాలనే ఆశయంతో కీర్తిశేషులు శ్రీ నందమూరి తారకరామారావు గారు రాష్ట్రమంతటా సుడిగాలిలా పర్యటించి మహోధృతమైనప్రభంజనాన్ని సృష్టించి తెలుగుదేశంపార్టీని అధికారం లోకి తెచ్చారు. సమాజమే దేవాలయమని, పేద ప్రజలందరికీ కనీస అవసరాలైన ఆహారం, ఇల్లు, వస్త్రం, విద్య, వైద్య సౌకర్యాలను సమకూర్చాలని, సమాజంలోని అన్నివర్గాల ప్రజలు సర్వతోముఖాభి వృద్ధిని సాధించాలని తెలుగుదేశం ఆకాంక్ష. మెరుగైన జీవన ప్రమాణాలతో కుల, మత, వర్గరహితంగా అందరూ శాంతి సమ భావములతో సహజీవనం గడిపేవిధంగా కృషిచేయడమే తెలుగు దేశం యొక్క మహోన్నతమైన ఆశయం. చంద్రబాబు నాయుడుగారు మొక్కవోని దీక్షతో, నిరంతర శ్రమతో కృషిసల్పుతూ వున్నారు. కొద్దినెలల్లో నూతన సహస్రాబ్దిలోకి అడుగిడనున్న మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజంపట్ల దృఢమైన విశ్వాసంతో, గాంధీజీ ప్రవచించిన ధర్మకర్తృత్వ సిద్ధాంతమునను సరించి పార్టీ ప్రవచించినఆదర్శములు, విధానాలకనుగుణంగా, ఆదర్శప్రాయమైన రీతిలో పరిపాన సాగిస్తూ అద్భుతమైన ఫలితాలను తెలుగుదేశం ప్రభుత్వం సాధించడం, వీటిపట్ల తెలుగుదేశం పార్టీకి గల [illegible]ట్టి నమ్మకానికి నిదర్శనం.

సంక్షేమం మరియు అభివృద్ధి రెండింటికి సమతులప్రాధాన్యతను ఇస్తుంది తెలుగుదేశం. రాష్ట్రం సరియైనదిశలో ఆర్థిక అభివృద్ధిని సాధించగలిగినప్పుడే, సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయటానికి సాధ్యమవుతుంది. కేవలం పోర్టు, ఎయిర్‌పోర్టు కలిగి వున్న సింగపూర్ మానవ వనరులను చక్కగా వినియోగించి బ్రహ్మాండమైన పురోభివృద్ధిని సాధించగా, సమస్త వనరులు గల మన ఆంధ్రప్రదేశ్ ఇంకా ఎంతో ఎక్కువగా ప్రగతిని సాధించే వీలుంది. మనరాష్ట్రంలో సారవంతమైన భూమి, పుష్కలంగా నీరు, వేయి కిలోమీటర్ల సముద్రతీరం, అపారమైన ఖనిజ సంపద, కష్టించి పనిచేసే ప్రజలు, ఆర్థిక వనరులు ఉన్నాయి. వాటన్నింటిని చక్కగా వినియోగిస్తూ, వ్యక్తులలోని సృజనాత్మక శక్తులను వికసింపచేస్తూ, మానవవనరులను సంపూర్ణంగా సద్వినియోగపరచాలనితెలుగుదేశం ఆశయం. తద్వారా 2020 నాటికి రాష్ట్రంలోని ప్రజలందరికి ఉన్నత ప్రమాణాలతో, శాంతి సౌభాగ్యాలతో కూడిన సుఖవంతమైన జీవితం లభింపచేయాలనే మహోన్నతమైన లక్ష్యంతో "విజన్ 2020" రూపొందించబడింది.

మానవుడు పట్టుదలతో నిరంతరంగా కష్టపడి పనిచేస్తే ఎంతైనా సాధించవచ్చు. సరియైన విధానాలు వుండి, ప్రోత్సాహం, సహకారం నిండుగా వుంటే, విదేశాలలోని తెలుగువారివలె మనరాష్ట్రంలో కూడా ప్రజలు బ్రహ్మాండమైన ప్రగతిని సాధించగలరని తెలుగుదేశం విశ్వసిస్తుంది. ఇందుకోసం స్పష్టమైన, పారదర్శకతతో కూడిన విధి విధానాలు ఉండాలి. పాలనాపరంగా అనవసరమైన అడ్డంకులు లేకుండా, అధికార వికేంద్రీకరణ కొనసాగాలి. తప్ఫలితంగా మన రాష్ట్రం రానున్న సమీపకాలంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకో గలుగుతుందని తెలుగుదేశం దృఢంగా నమ్ముతుంది.

ప్రజల భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి సక్రమంగా, తక్కువ వ్యయంతో, ఉద్దేశించిన లబ్దిదారులకు ప్రయోజనం చేకూరేలా జరుగుతుందని తెలుగుదేశం నమ్ముతూంది. జన్మభూమి, శ్రమ దానం, ప్రజల వద్దకు పాలన వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పరిపాలనలో సామర్థ్యం పెరుగుతూంది. అధికార యంత్రాంగంలో ప్రజలకు జవాబుదారీతనాన్ని పెంచడం జరిగింది. సామాన్యప్రజలలో తమ సామాజిక అవసరాలను సాధించుకోవడంలో అవగాహనను, ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపచేయడం సుసాధ్యమైంది. మానవాళి యొక్క మనుగడకు, ప్రగతికిఅవసరమైన సహజవనరుల పరిరక్షణలో, సక్రమవినియోగంలో ప్రజలభాగస్వామ్యం అవసరమని తెలుగుదేశం దృఢంగా విశ్వసిస్తుంది. ఎంతో విలువైన సాగునీటిని పొదుపుగా వాడుతూ చివరి భూములకు, సకాలంలో అందేలా రైతులే నీటి వనరులను నిర్వహించుకునేందుకు సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. అటవీ సంపదను పెంపొందిస్తూ, తద్వారా వచ్చు ఫలసాయాన్ని సంపూర్ణంగా పేదప్రజలే పొందగలిగేందుకు వనసంరక్షణ సమితులు ఏర్పడ్డాయి. భూమికోతను నివారించి వర్షపునీటిని భూమిలోకి ఇంకేటట్లు చేసి, పంటలకు ఉపయోగపరచడంకోసం, వృక్షసంపదను పెంచేందుకు మరియు భూమిసారాన్ని వృద్ధిపరిచేందుకు వాటర్‌షెడ్ కమిటీలు ఏర్పాటైనాయి. వీటిఏర్పాటుద్వారాప్రభుత్వ అజమాయిషీని తగ్గించి, నిధులను, అధికారాలను ప్రజాసంఘాల ద్వారా ప్రజలకే దాఖలుపరచడం తెలుగుదేశం లక్ష్యం. దీని పర్యవసానంగా ఎంతో చక్కని ఫలితాలు ఈనాడు మనరాష్ట్రంలో సమకూరుతున్నాయి.

స్థానిక సంస్థలకు న్యాయమైన అధికారాలను, వనరులను సమకూర్చి ప్రోత్సహించడం ద్వారా ప్రగతిసాధనలో ప్రముఖపాత్రను వాటిచే నిర్వహింపజేయాలనేది తెలుగుదేశం ఆదర్శం. స్థానిక సంస్థల పరిధిలో, ప్రజల దృష్టిలో ప్రాధాన్యతగల అవసరాలను తీర్చేవిధంగా గ్రామస్థాయినుండి ప్రణాళికలను రూపొందించే ప్రక్రియ వలన

సత్ఫలితాలు సాధించవచ్చని తెలుగుదేశం భావిస్తున్నది. స్వచ్ఛంద సేవా సంస్థలు, స్వయం సహాయక గ్రూపులు ప్రజలలో చైతన్యాన్ని పరస్పర సహకారాన్ని పెంపొందించడం ద్వారా గొప్ప సామాజిక మార్పునకు ఎంతో దోహదం చేయగలవని నమ్ముతున్నందున వాటిని తెలుగుదేశం ప్రోత్సహిస్తుంది. తన జీవితమే తన సందేశం అన్నారు మహాత్మాగాంధీ. తెలుగుదేశంపార్టీ తన విధానాలలో జాతిపిత ఆశయాలను ఆచరణలో చేసిచూపుతుంది.

శాంతిభద్రతలు పటిష్టంగా వున్నప్పుడే అభివృద్ధి కూడా సాధ్యమౌతుంది. తీవ్రవాద భావాలతో వున్నవారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల సమస్యల పరిష్కారానికి, వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకరించాలని తెలుగుదేశం వాంఛిస్తుంది. పౌరులకు రక్షణ కల్పించడంలో, శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం శక్తివంచన లేకుండా పాటుపడుతుంది. రౌడీయిజం, ముఠాకక్షలు, భూకబ్జాలు, మతఘర్షణలు నిర్దాక్షిణ్యంగా అరికట్టబడుతున్నాయి. రాజకీయాలలో నేరస్థుల ప్రాబల్యాన్ని నిరోధించడానికి సకల చర్యలు తీసుకోబడుతాయి.

విద్యతోనే వికాసం సాధ్యమని తెలుగుదేశం విశ్వసిస్తుంది. ప్రజలలో నైపుణ్యతను, ఉత్పాదకతను పెంచేందుకు విద్య దోహదం చేస్తుంది. నాణ్యమైన ప్రాథమిక విద్యను అందరికీ అందించాలనే లక్ష్యం నెరవేరేందుకు ప్రజల భాగస్వామ్యం గల విద్యాకమిటీలు ఏర్పరచబడ్డాయి. గ్రామాల్లో పేదప్రజలపిల్లలకు మంచిప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని తెలుగుదేశం లక్ష్యం. వేలాది తరగతి గదులను నిర్మించడం, లక్షమందికిపైగా ఉపాధ్యాయులను, విద్యా వాలంటీర్లను నియమించడం జరుగుతోంది. అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటురంగాలలో జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజనీర్ కళాశాలలు అనుమతించబడ్డాయి. ఫలితంగా సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగి, సామాన్యుల పిల్లలకు కూడా ఉన్నత విద్యనభ్యసించే అవకాశాలు కలుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ తన జీవితానికి బంగారుబాటను వేసుకోగల అవకాశాన్ని కల్పించడం తెలుగుదేశం ప్రభుత్వం ఆదర్శం. రెసిడెన్షియల్ పాఠశాలలను అధికంగా నెలకొల్పి, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలు మెరుగుపరచబడుతాయి.

ప్రాచ్యభాషలలో అత్యంత మధురమైనభాషగా అందరిచే కీర్తించ బడిన మన తెలుగుభాష మహోన్నత వికాసానికి, ప్రభుత్వ పరిపాలనలో తెలుగును విస్తృతంగా వాడేందుకు తెలుగుదేశం పాటుపడుతుంది. తెలుగుజాతి నిండుగౌరవం, కీర్తిప్రతిష్టలు నలుచెరుగులా వ్యాపించేదానికి తెలుగుదేశం నిరంతరంగా కృషి చేస్తుంది. దేశ సంపదలో మానవ వనరులకు అత్యంత ప్రాముఖ్యత కలదు. ప్రజలంతా ఆరోగ్యంతో ఉన్నపుడే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యపడుతుంది. సామాన్య ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలను సమర్థవంతంగా అందించడం తెలుగుదేశం ఆశయం. ప్రజల్లో చైతన్యం పెంచి, చిన్నబిడ్డల సంరక్షణకు సకల చర్యలు తీసుకొంటూ, జనాభా పెరుగుదలను నియంత్రించడం అత్యంత ఆవశ్యకమని తెలుగుదేశం భావిస్తుంది. నేల, గాలి, నీరు కాలుష్యరహితంగా ఉండేటట్లు పరిరక్షించి, పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నది తెలుగుదేశం ధ్యేయం. వ్యక్తిగతంగానూ, పరిసరాల్లోనూ పరిశుభ్రతను పరిరక్షించుకుంటూ, కుటుంబ సభ్యులంతా హాయిగా ఉన్నప్పుడే, తమ శక్తిమేరకు పనిచేయగల్గి కుటుంబ సౌభాగ్యం కొరకు పాటుపడ గలుగుతారు. మూఢవిశ్వాసాలకు తిలోదకాలిచ్చి, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చి, చైతన్యవంతంగా, ఆనందదాయకంగా ప్రజలందరూ జీవించాలని, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు తగినంత పౌష్టిక ఆహారం తీసుకొనగల్గాలని తెలుగుదేశం దృఢంగా కోరుకుంటున్నది. ప్రజలందరికీ త్రాగునీటిని అందించేందుకు తీవ్రంగా కృషిచేస్తుంది. అందవలననే ప్రపంచబ్యాంకు నుండి పొందిన నిధులలో అత్యధిక భాగం సామాజిక రంగానికే ఖర్చుచేస్తున్నది.

మనరాష్ట్రంలో నూటికి 70 మందికిపైగా ప్రజలకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ జీవనాధారమైన వ్యవసాయరంగం యొక్క ప్రగతికోసం తెలుగుదేశం కంకణం కట్టుకున్నది. ఆపత్కాలంలో రైతులను వెంటనే ఆదుకోవడమే గాక, రైతాంగానికి అవసరమైన ఎరువులు, పరపతి, విద్యుత్‌ను అందించడం జరుగుతూంది. సాగునీటి సౌకర్యాన్ని విస్తరించడం జరుగుతూంది. కల్తీ పురుగు మందులను అరికట్టేందుకు చట్టపరమైన మార్పులను చేయించడం జరుగుతోంది. సవరించిన పంటల బీమాపథకం ప్రవేశపెట్టించడం, దళారీల దోపిడీనుండి రైతులను తప్పించేందుకు రైతుబజారులను నెలకొల్పడం, ధాన్యం, పత్తి, పొగాకు, మిర్చి, ఉల్లి వంటి పంటలను కేంద్ర సంస్థలచేత కొనుగోలుచేయించడం వంటి అనేక కార్యక్రమాల ద్వారా రైతాంగం యొక్క సంక్షేమానికి, ప్రగతికి పాటుపడడం తెలుగుదేశం ఆదర్శం. రాష్ట్ర ప్రగతికి అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయుటయేగాక, వినియోగదారులకు మెరుగైన సేవలను, నాణ్యతతో కూడిన విద్యుత్‌ను సప్లై చేసేందుకు సంస్కరణలు చేపట్టబడ్డాయి. రానున్న ఐదేండ్లలో కావాలన్న రైతులందరికీ విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వబడుతాయి. కరెంటుకోత లేకుండా చేయబడుతుంది.

నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యునికి అందుబాటులో ఉండేందుకు వేరుశనగనూనె, పామోలిన్‌నూనె, చింతపండు, కంది పప్పు, మిరపకాయలు, ఉల్లిపాయలు మున్నగువాటినిప్రభుత్వంకొని, నిల్వపెట్టి, మార్కెట్లో వీటిధరలు హెచ్చుగా పెరగకుండా నియం త్రించడం ద్వారా వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం తెలుగుదేశం యొక్క విధానం. రైతులకు, కొనుగోలు దార్లకు ప్రయోజనాత్మకంగా రాష్ట్రమంతటా రైతుబజార్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి మరింత పటిష్టం చేయబడతాయి. ఇప్పటికే ఇందుకై తీసుకున్న చర్యలు పటిష్టంగా భవిష్యత్‌లో కూడా కొనసాగుతాయి.

స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించడంలో వ్యవసాయరంగం, ముఖ్యంగా ధాన్యం, పౌల్ట్రీ, డెయిరీ, తోటల పెంపకం, ఆక్వా కల్చర్, ఇతర వ్యవసాయాధార పరిశ్రమలు అత్యంత ప్రముఖపాత్ర వహిస్తాయి. కావున వీటిని వేగంగా అభివృద్ధి చేయడానికి సకల చర్యలు తీసుకోబడుతున్నాయి.

నిర్మాణం, ఖనిజాధార పరిశ్రమలు, దుస్తుల తయారీ, తోలు ఉత్పత్తులు, మందులు, చిన్నతరహా పరిశ్రమల్లో తయారగు వస్తువులు వంటి కార్మికులతో ముడిపడిన ఎగుమతి నిర్దేశిత పరిశ్రమల అభివృద్ధికి, అందుకు కావలసిన మౌలికవసతులకల్పనకు తెలుగుదేశం ప్రాధాన్యతనిస్తుంది. అభివృద్ధికి–రహదార్లకు అవినాభావ సంబంధం వుంది. కాబట్టి మారుమూల పల్లెలకు కూడా పక్కా రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు జిల్లా, రాష్ట్ర జాతీయ రహదార్లను అభివృద్ధిచేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం పట్టుదలతో కృషిచేస్తుంది. రాజధాని నగరంతోపాటు అనేక పట్టణాలలో, గ్రామాలలో రహదార్లను వెడల్పు చేయడం ద్వారా రద్దీని తగ్గించేందుకు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషిని కొనసాగిస్తుంది. విమానాశ్రయాలు, పోర్టుల అభివృద్ధి ప్రాధాన్యతను తెలుగుదేశం గుర్తించి అందుకు అనుగుణమైన చర్యలు యుద్ధ ప్రాతిపదికపై చేపట్టింది.

జనాభాలో సగభాగంగా వున్న మహిళలకు కూడా పురుషులతో పాటు అన్నిరంగాలలో సమాన అవకాశాలు కల్పించడం తెలుగుదేశం ఆశయం. వస్తూత్పత్తిలో, సేవలందించడంలో మహిళలు ఇతోధికంగా పాల్గొనాలని, రాష్ట్రాభివృద్ధిలో గణనీయమైన పాత్ర వహించాలని తెలుగుదేశం గాఢంగా వాంఛిస్తుంది. అందుకే పార్లమెంట్, శాసన సభలలో వారికి మూడవవంతు ప్రాతినిధ్యం వుండాలని మొట్ట మొదటగా ప్రతిపాదించింది కూడా తెలుగుదేశమే. దేశంలోనే మొదటిసారిగా స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించింది కూడా తెలుగుదేశమే. తన స్వయంకృషితో తాను, తన కుటుంబమును సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిపరచుకోగలనన్న ఆత్మవిశ్వాసాన్ని, సాధికారతను మహిళల్లో పెంపొందించాలనేదే తెలుగుదేశం ఆదర్శం. మహిళలకు సాంఘిక భద్రతను, సామాజిక న్యాయాన్ని కల్పించడం కోసం, మహిళల హక్కులను పరిరక్షించడం కొరకు రాష్ట్ర మహిళా కమీషన్ ఏర్పాటుచేయబడింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో, అన్ని వృత్తివిద్యా కోర్సుల్లో మూడవవంతు రిజర్వేషన్ మహిళలకు కల్పించబడింది. మహిళలను పొగబారినుండి రక్షించేందుకు, అడవుల నరికివేతను నివారించేందుకు లక్షలాది పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలనేది తెలుగుదేశం లక్ష్యం.

మెరుగైన ఆధునికపనిముట్లను చేతివృత్తులవారికిఅందించేందుకు 'ఆదరణ' ప్రవేశపెట్టిబడింది. సిఎంఇవై పథకాన్ని అమలుచేయడం ద్వారా యువజనుల్లో చైతన్యం పెరిగింది. వ్యవసాయానుబంధ పరిశ్రమలు, చిన్న పరిశ్రమలను అభివృద్ధిపరిచి, ఇంకా ఇతర స్వయం సహాయక గ్రూపులను ప్రోత్సహించి సేవారంగంలో ఉపాధి అవకాశాలను పలురెట్లుగా పెంచడం ద్వారా దారిద్ర్యాన్ని పార ద్రోలాలని తెలుగుదేశం ధ్యేయంగా పెట్టుకొంది. వేలాది ఎస్.సి., ఎస్.టి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేయడమే కాక టీచర్లు, డాక్టర్లు మున్నగువారిని వేలాదిమందిని గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉద్యోగంలోకి తీసుకొని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తూంది. ఉపాధి కల్పనలో, ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో సేవారంగం కీలకపాత్ర వహిస్తుంది. మౌలిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసులు, పరిజ్ఞానం, ఆధారిత సర్వీసులు, టూరిజం, చిన్నతరహా సర్వీసులు, ఆరోగ్య సంరక్షణ, విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ఉద్యోగ అవకాశాలు బ్రహ్మాండంగా పెరగడమే కాక, మనరాష్ట్రంలో కార్మికుల ఉత్పాదకత శీఘ్రగతిన పెరుగుతుంది. మనరాష్ట్రం నుండి ఎగుమతులు పెరుగుతాయి. ప్రభుత్వరంగ పరిశ్రమల మనుగడకు, పటిష్టతకు దోహదం కలుగుతుంది. విధిలేని పరిస్థితుల్లో తొలగించబడిన కార్మికుల పునరావాసానికి అవసరమైన నిధులను అందించి, వారి శ్రేయస్సుకు తెలుగుదేశం పాటుపడుతుంది.

మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూనే, సామాజికరంగాన్ని ఉపేక్ష చేయక, సామాన్య ప్రజల ప్రగతికి, సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం ఈ దేశంలో ఇతర రాష్ట్ర ప్రభుత్వాల కన్నా ఎన్నోరెట్లు అధికంగా కృషిచేస్తూంది. సబ్సిడీ బియ్యం, సబ్సిడీపై విద్యుచ్ఛక్తిని వ్యవసాయరంగానికి అందించడం, పేదలకు పక్కాగృహాల నిర్మాణం, ఇండ్లస్థలాల పట్టా ప్రదానం, షెడ్యూలు కులాలకు 'ముందడుగు', షెడ్యూలు తెగలకు 'చైతన్యం', వెనుకబడిన తరగతులకు 'ఆదరణ', మైనారిటీవర్గాల ప్రజలకు 'రోష్నీ', వికలాంగులకు 'చేయూత', మహిళామతల్లులకు 'డ్వాక్రా', 'దీపం', విద్యార్థులకు 'ప్రతిభ', ఇతరత్రా రైతన్నలు, కార్మికులు, కష్టజీవుల జీవితాలలో వెలుగును నింపగల అనేక పథకాలను అమలుచేయడం తెలుగుదేశం విధానం. దారిద్ర్యరేఖకు దిగువన వున్న నిరుపేదలందరికీ ఉపాధి అవకాశాలు కల్పించబడి వారి పేదరికం తొలగి, ఆనందంగా జీవించగల పరిస్థితులు కల్పించబడేవరకు అనేక పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తుంది తెలుగుదేశం ప్రభుత్వం. బలహీనవర్గాల వారికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించి, శిక్షణనిప్పించి మంచి అవకాశాలు అందుకొని ముందుకు సాగేవిధంగా తగిన వాతావరణం కల్పించబడుతుంది. బడుగు, బలహీనవర్గాలకు సామాజిక న్యాయం లభింపచేయడంలో తెలుగుదేశం ఎల్లప్పుడూ అగ్రభాగాన వుంటుంది.

నిరాడంబరత, నైతిక నిబద్ధత, జవాబుదారీతనం, స్పందించే తత్వం, పారదర్శక లక్షణాలతో ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన, ఆదర్శప్రాయమైన ప్రభుత్వంగా వెలుగొందాలన్నది తెలుగుదేశం ప్రభుత్వం సంకల్పం. పాలనాయంత్రాంగ పనితీరును మెరుగుపరిచి, ప్రజలకు సమర్థవంతమైన, నీతివంతమైన, స్వచ్ఛమైన పరిపాలన అందించాలనే ఆశయంతో కృషిచేస్తూంది. ఉద్యోగాలు ఇవ్వడంలో, ఉద్యోగులబదిలీల్లో అవినీతి, పక్షపాతాలకు తావులేకుండా చేయుటకు కౌన్సిలింగ్ విధానం ప్రవేశపెట్టబడింది. పట్టణ భూసంబంధ వ్యవహారాల్లో, గృహనిర్మాణాల్లో అవకతవకలకు ఆస్కారంలేనివిధంగా పారదర్శకమైన, స్పష్టమైనవిధానం రూపొందించబడింది. విచక్షణాధి కారం వలన జరిగే అవినీతికి ఆస్కారం తొలగించబడింది. అవినీతి, అక్రమాలకు ఏరూపంలోను ఆస్కారం కలుగనివ్వరాదనేది తెలుగు దేశం యొక్క స్పష్టమైన విధానం. 'నైతిక విలువల కమిటీ'ని ఏర్పరచి,

విధిగా శాసనసభ్యులు తమ కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను స్పీకరు గారికి అందజేయు సత్‌సంప్రదాయం ఏర్పాటుచేయబడింది.

ప్రజలు చెల్లించిన పన్నులు, ప్రభుత్వం వివిధ మార్గాలలో సేకరించిన ఆర్థిక వనరులను ఒక్కపైసా కూడా దుర్వినియోగం కానివ్వరాదనే లక్ష్యంతో టెండర్ సంస్కరణలు తీసుకురాబోతున్నాం. వ్యయ ప్రాధాన్యతలను నిర్ణయించి, ఆర్థిక పరిస్థితిని సంఘటితపరచి, వృధావ్యయాన్ని అరికట్టి, ప్రభుత్వ ఆస్తుల సక్రమ నిర్వహణ చేయడం తెలుగుదేశం లక్ష్యం. తద్వారా ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తిచేసి, అత్యధిక ఫలితాలనిచ్చే కొత్త ప్రాజెక్టులను ఎంపికచేసి, పెద్దఎత్తున ప్రవాస భారతీయులతోసహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి పెట్టుబడులను ఆకర్షించడం తెలుగుదేశం ఆశయం. మన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపొందించాలనేదే మన తెలుగుదేశం ప్రభుత్వ ఏకైక లక్ష్యం.

జాతీయ రాజకీయాలలో నిర్మాణాత్మక పాత్రను తెలుగుదేశం పోషిస్తుంది. సహకార ఫెడరలిజం స్ఫూర్తి బలపడినపుడే రాష్ట్రాలు బలంగా రూపొందించినప్పుడే కేంద్రం కూడా పటిష్టంగా ఉంటుంది. ఇదే ఆకాంక్షతో రాష్ట్రాలకు ఇతోధికంగా ఆర్థిక, పరిపాలనాపరమైన అధికారాలను మరియు వనరులను లభింపచేయుటకు తెలుగుదేశం కృషిచేస్తుంది. ఆర్టికల్ 356 దుర్వినియోగం కాకుండా వుండుటకు తగినవిధంగా సవరించబడాలని కోరుతోంది. అంతర్‌రాష్ట్ర మండలి క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరుతోంది. ప్రణాళికా ప్రక్రియలో జాతీయ అభివృద్ధి మండలికి తగుఅధికారాలు కల్పించడం తెలుగుదేశం ఆదర్శం. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వపాలనకు దోహదం చేస్తుంది. కండబలం, ధనప్రాబల్యాన్ని అరికట్టేందుకు, పరిశుద్ధమైన రాజకీయవ్యవస్థ బలపడడంకొరకు సమగ్రమైనఎన్నికలసంస్కరణలను తెచ్చేందుకు కృషిచేస్తుంది.

దేశ సమగ్రతను పరిరక్షించడంలో, మత సామరస్యాన్ని పటిష్ట పరచడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుంది. మనరాష్ట్రంలో గతంలో పలుమార్లు చెలరేగిన మతకల్లోలాల వెనక అదృశ్యహస్తం ఎవరిదో అందరికీ తెలిసినదే. ముస్లిం, క్రిస్టియన్ మున్నగు మైనారిటీ ప్రజలసంక్షేమానికి, వారి భద్రతకు, హక్కులపరిరక్షణకు తెలుగుదేశం ప్రాధాన్యతనిస్తుంది. భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారి విద్యాభివృద్ధికి తగుచర్యలు తీసుకోబడును. ఉర్దూను రెండవ అధికార భాషగా 12 జిల్లాల్లో ప్రకటించడం జరిగింది.

గతంలో ఏనాడూ లేనివిధంగా కేంద్రప్రభుత్వం నుండి సహకారాన్ని రాబడుతూ అనేక ప్రతిపాదనలకు ఆమోదాన్ని పొందుతూ, అదనంగా నిధులను రాబట్టి మన రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడంలో మన ముఖ్యమంత్రి అమోఘమైన పట్టుదలను, చాకచక్యాన్ని ప్రదర్శించారు. పలు ఇరిగేషన్ పథకాలకు ఆర్థిక సాంకేతిక అనుమతిని సాధించడమే కాక వెనుకబడిన తెలంగాణా ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేయడానికి గోదావరి జలాలను వినియోగించడానికి గోదావరిజలాల అథారిటీని ఏర్పరిచి ఒక బృహత్తర పథకాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందించింది. బచావత్ అవార్డు ద్వారా మన రాష్ట్రానికి కేటాయించబడిన నీటిని సంపూర్ణంగా వినియోగించడం ద్వారా తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, వెలిగొండ, భీమా, పులిచింతల మున్నగు పథకాలను చేపట్టి కృష్ణాజలాలను సంపూర్ణంగా వినియోగంలోకి తెచ్చే కృషి కొనసాగుతుంది. అనేక విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులు, అదనంగా సహజవాయువు కేటాయింపు, నెల్లూరు జిల్లాలో ఇఫ్కో ఎరువుల కర్మాగారం, రూ.663 కోట్లు సింగరేణికాలరీస్‌సంస్థ బకాయిలపై మారటోరియం వంటి ఎన్నెన్నో నిర్ణయాలను, కేంద్రం నుండి సహకారాన్ని రాబట్టారు మన ముఖ్యమంత్రి.

లోగడ నుండి మనదేశం అనుసరిస్తున్న అలీనవిధానానికే కట్టు బడాలని, వర్ధమానదేశాల ప్రయోజనాలు కాపాడుకోవడంలో నిర్మా ణాత్మక వైఖరిని అవలంబించాలని తెలుగుదేశం కోరుతోంది. వివక్ష తతో కూడిన సిటిబిటి, ఎన్‌పిటిలను మనదేశం అంగీకరించరాదని తెలుగుదేశం దృఢంగా భావిస్తోంది. మనదేశ సరిహద్దులను ప్రాణ ప్రదంగా కాపాడుకొంటూ గాఢమైన దేశభక్తితో మనదేశ సార్వ భౌమత్వాన్ని, కీర్తిప్రతిష్టలను పదిలంగా నిలుపుకుంటూ మనదేశ ప్రయోజనాలను పరిరక్షించుకొంటూనే మన పొరుగుదేశాలతో సత్సం బంధాలను కొనసాగించాలని తెలుగుదేశం అభిప్రాయపడుతోంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అయిదు దశాబ్దాలు దాటినా కేంద్రంలో, మనరాష్ట్రంలో నాలుగు దశాబ్దాలపాటు కొనసాగిన కాంగ్రెస్ దుష్టపరిపాలన వలన దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, సాంఘిక, ఆర్థిక అసమానతలు ఈనాటికీ కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని సమూలంగా మార్పుచేయాలని మనరాష్ట్రంలో ఉపాధితో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించాలని 2020 సంవత్సరం నాటికి మన రాష్ట్ర అభివృద్ధిరేటు తొమ్మిదిరెట్లు పెరగాలని, మన ప్రజలంతా మెరుగైన జీవన ప్రమాణాలతో అర్థవంతమైన, సుఖప్రదమైన జీవితం గడపగలిగేలా చేయాలనే మహోత్కృష్టమైన ఆశయంలో తెలుగు దేశం ప్రభుత్వం నిర్విరామంగా కృషిచేస్తున్నది. దేశంలోనే అభివృద్ధి క్రమంలో మన రాష్ట్రాన్ని మొట్టమొదటిస్థానంలో నిలపాలని, ఒక ఆదర్శప్రాయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఏకైక లక్ష్యంతో కృషి జరుగుతోంది. మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోను ప్రజలంతా అన్నిరంగాల్లో వేగంగా సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు జరుపు తున్న నిర్విరామ కృషి, పరిపాలనాపరంగా తీసుకువచ్చిన పలు మార్పులు దేశవ్యాప్తంగానే కాక, ఇతర దేశాలలో కూడా శ్లాఘించ బడుతున్నాయి. అందువలన రానున్న శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అత్యధికమైన స్థానాలలో, అత్యధికమైన మెజారిటీతో గెలిపించి, సమర్థవంతమైన ఆదర్శప్రాయ మైన తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారానికి వచ్చి మనరాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపొందించబడేందుకు మీకు, మీ పిల్లల ఉజ్వలమైన భవితవ్యాన్ని పొందేందుకు తమ అమూల్యమైన సహాయ సహకారాలను అందించాలని తెలుగుదేశం మీ అందరికీ ముకుళిత హస్తాలతో, వినమ్రతతో విజ్ఞప్తి చేస్తూంది. ○

వ్యూహం, ఎత్తుగడలు: స్పందనపై స్పందన

— కొల్లి సత్యనారాయణ

ప్రజాపక్ష "సమీక్ష" పత్రికలో 'ఐక్య సంఘటన-వ్యూహం-ఎత్తుగడలు' శీర్షికతో నేను రాసిన వ్యాసాన్ని కస్తూరి అంజయ్యగారు ఒకటికి నాలుగుసార్లు చదివి, స్పందించినందుకు (1-15 సెప్టెంబరు) రాసినందుకు సంతోషం, కృతజ్ఞతలు తెలియచేస్తున్నా.

ఆ వ్యాసంలో కొన్ని ఆరోపణలతోపాటు, భౌతిక, వాస్తవిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా, స్వీయ మానసికతకు, ఊహాగానాలకు ప్రాధాన్యతనిచ్చానని, కొన్ని యాంత్రికంగా అన్వయించే ప్రయత్నం చేశానని, ఆ విధంగా గందరగోళం సృష్టించినట్లు రాశారు. వాటికి సమాధానంగా వ్యాసం రాస్తున్నాను.

మొదటి విషయం- రెండవ ప్రపంచయుద్ధకాలంలో సోవియట్ యూనియన్ అవలంబించిన ఎత్తుగడలను సుదీర్ఘంగా చర్చించటం జరిగింది. కానీ నేటి పరిస్థితులకు అది నిర్దిష్టంగా ఎట్లా వర్తిస్తుందనే అంశం గురించి అశ్రద్ధ వహించి చాలా యాంత్రికంగా అన్వయించే ప్రయత్నం చేశానని రాశారు. అదేమిటో ముందు పరిశీలిద్దాం.

విప్లవ శ్రామిక శక్తులకు, ఆ శక్తులకు నాయకత్వం వహించే వారికి విప్లవాన్ని విజయవంతం చేయటానికి ఒక వ్యూహాన్ని, ఆ వ్యూహానికి అనుగుణంగా, దానికి లోబడి ఎత్తుగడలు వుంటాయని అంజయ్యగారు అంగీకరిస్తారనుకుంటాను. వ్యూహం అనేది ఒక దశకు అంతటికీ మారకుండా వుంటుందని, ఎత్తుగడలు ఆ వ్యూహానికి లోబడి, దేశ దేశానికీ, ఒకేదేశంలో ప్రాంతానికీ, ప్రాంతానికీ అక్కడి వాస్తవ పరిస్థితులను బట్టి మారతాయని కూడా అంజయ్యగారు ఒప్పుకుంటారనునుకుంటాను.

ఒకదశ అంటే ఏమిటి? అన్నది కూడా చూద్దాం. జర్మనీతో నాజీ శక్తులు అధికారంలోకి వచ్చేవరకు ఒకదశ. తరువాత జర్మనీపై ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు యుద్ధం ప్రకటించి యుద్ధం అంతమయ్యేవరకు ఒకదశ. భారతదేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంకొనసాగి, 1947లో స్వాతంత్ర్యం ప్రకటించేవరకు ఒకదశ. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బి.జె.పి. నాయకత్వాన ఎన్.డి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు ఒకదశ. ఈ దశ ఇంకా కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం జరిగి, భారతయూనియన్‌లో చేరేవరకు ఒక దశ. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి కాంగ్రెస్ పాలన, ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడేవరకు ఒకదశ. ఈ దశ కొనసాగుతూ వుంది. ఈ వివరణలో కూడా అంజయ్యగారికి అభ్యంతరం లేదనుకుంటాను.

రెండవ ప్రపంచయుద్ధానికి ముందు పరిస్థితిని ఇప్పుడు పరిశీలిద్దాం. మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడింది. దానిని పురిటిలోనే పీక నులమాలని 14 దేశాలు దాడిచేసినప్పుడు లెనిన్ చేసుకున్న ఒప్పందంతో యుద్ధ విరమణకు దారితీసిన విషయం తెలిసిందే.

మొదటి ప్రపంచయుద్ధంలో ఓడిపోయిన జర్మనీ, తిరిగి పుంజుకొని, జాత్యాహంకారాన్ని రెచ్చగొట్టి, ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావటం, సోవియట్‌యూనియన్‌పై దాడే తన లక్ష్యమని ప్రకటించి, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాల నుండి ఆయుధ, ఆర్థిక సహాయం పొంది, పెద్ద సైనికశక్తిగా తయారైన విషయం తెలిసిందే. బలపడిన తరువాత, మొదటి ప్రపంచయుద్ధం తరువాత, తమదేశం లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్న భూభాగాలను తిరిగి అప్పగించమని కోరుతూ ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లకు వ్యతిరేకంగా యుద్ధ ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిన విషయమే.

ఆ సమయంలో సామ్రాజ్యవాద దేశాలైన ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలు ఒక కూటమిగా ఏర్పడటం, దానికి పోటీగా జర్మనీ, జపాన్, ఇటలీలలోని ఫాసిస్టు శక్తులు ఒక కూటమిగా ఏర్పడటం జరిగింది. అక్కడినుండి మార్కెట్లకోసం వివాదం కొనసాగింది. యూరప్‌లోని తన భూభాగాన్ని జర్మనీ ఆక్రమిస్తే, ఆఫ్రికాలోని అబిసీనియాను ఇటలీ ఆక్రమించుకుంది. చైనాపై జపాన్ దండెత్తి మంచూరియాను ఆక్రమించుకుంది.

యుద్ధనష్టాన్ని పూడ్చుకుని, దేశంలో అంతర్యుద్ధం నుండి బయటపడి, పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయటానికి రష్యా కృషిచేస్తోంది. ఇది అప్పటి వాస్తవ పరిస్థితి.

జర్మనీలో ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాగానే కార్మికవర్గం పైన, కమ్యూనిస్టుపార్టీపైన, పార్లమెంటుభవనాన్ని తగులబెట్టారని అపవాదువేసి, పెద్దఎత్తున దాడిచేసింది. మూకుమ్మడి హత్యాకాండ కొనసాగించింది. ప్రపంచ ప్రజలకు ఫాసిస్టు శక్తుల ప్రమాదం ఏర్పడిందని, ఫాసిస్టు శక్తులను అణచటం ప్రధాన కర్తవ్యమని, అందుకుగాను ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్ ఏర్పడాలని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ, అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ (కోమిన్‌టరన్) వెంటనే పిలుపునిచ్చాయి.

శత్రువర్గంలోని వైరుధ్యాలను దృష్టిలో పెట్టుకుని, ప్రధాన శత్రువుఅయిన ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికవర్గం, శ్రామికరవర్గం ఐక్యసంఘటన నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించాలని అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ పిలుపునిచ్చింది. ఇది ఆనాటి వాస్తవ పరిస్థితి.

మరి ఇప్పుడు వాస్తవ పరిస్థితి ఏమిటి? సామ్రాజ్యవాద శిబిరం మళ్ళీ రెండుగా చీలింది. అమెరికా, ఇంగ్లాండ్‌ల నాయకత్వానికి ఒక కూటమి వుంటే ఫ్రాన్స్, జర్మనీ, పశ్చిమ ఐరోపా దేశాలు ఒక కూటమిగా తయారైనాయి. ఈ రెండో కూటమి దేశాలన్నీ కలసి యూరోపియన్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చలామణీ కోసం, అమెరికన్ డాలర్‌కు

పోటీగా 'యూరో' అన్న కొత్తనాణాన్ని ప్రవేశపెట్టాయి. ఇందుకు బదులుగా అమెరికా సైనికచర్యలు ప్రారంభించి నాటో కూటమిని తూర్పు ఐరోపా దేశాలకు (మాజీ కమ్యూనిస్టు దేశాలు) విస్తరించింది.

యూరోపియన్ యూనియన్ యూరోపియన్ సైన్యాన్ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించాయి.

ఈ రకంగా రెండు కూటములుగా ఏర్పడటమే కాకుండా మార్కెట్ల కోసం పోరాటం-సాయుధంగా కాదు-ప్రారంభించాయి. అమెరికాకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ బనానాయుద్ధం(అరటిపళ్ళ యుద్ధం) ప్రారంభించింది. అంతర్జాతీయ న్యాయస్థానంలో ఫ్రాన్స్ యీ వివాదంలో ఓడిపోయింది. అంతటితో ఆగకుండా ఇంగ్లాండ్‌తో మాడ్ (పిచ్చిఆవు) మాంసం దిగుమతిపై యుద్ధం ప్రారంభించింది. ఆ విధంగా రెండు శిబిరాల మధ్య వివాదాలు రగులుతూనేవున్నాయి. ఇది ఇలా వుండగా, ప్రపంచ కరెన్సీపై పెత్తనం చలాయిస్తున్న అమెరికన్ 'డాలర్'కు పోటీగా 'యూరో' రావటంతో 'డాలర్' గడ్డు పరిస్థితిని ఎదుర్కోవలసివచ్చింది. అసలే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని వున్న అమెరికా గిజగిజ తన్నుకోసాగింది. దేశంలో ఆర్థిక సంక్షోభం ఇదివరకెన్నడూ లేనంతగా మహాసంక్షోభంగా తయారైంది. ఆ సమయంలో ఇరాక్ చర్య అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. మొదటి గల్ఫ్‌యుద్ధంలో ఓడిపోయిన ఇరాక్‌పై సమితి కొన్ని షరతులు విధించింది. ఇరాక్ తన చమురు వ్యాపారాన్ని డాలర్లలోనే కొనసాగించాలని, తమ దేశానికి అవసరమైన మందులు, ఆహారం కొనుగోలుకు డాలర్లలోనే చెల్లించాలన్నది ఆ షరతుల్లో వుంది. కానీ, ఇరాక్, 'యూరో' ఏర్పడిన తరువాత ఆ షరతును ఉల్లంఘించింది. చమురు వ్యాపారం 'యూరో'లోకి మార్చుకుంది. ఇరాన్ కూడా ఈ మార్గాన్ని అనుసరించింది. ఈ మార్గాన్ని గనుక మిగిలిన అరబ్ దేశాలు అనుసరిస్తే డాలర్ విలువ పతనం కావడమే కాకుండా అమెరికా ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే, భద్రతామండలిని ధిక్కరించి ఇరాక్‌పై అమెరికా దాడి ప్రారంభించటానికి ముఖ్య కారణమైంది. ఇరాక్‌ను టెర్రరిస్టుదేశంగా ముద్రవేసి, ఇరాక్‌పై దాడిచేసి ఆక్రమించుకుంది.

ఈ దాడిని ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలు వ్యతిరేకించాయి. అయినా అమెరికా లెక్కచేయలేదు. కానీ గెరిల్లా యుద్ధం పద్ధతిలో ఇరాక్ ప్రజలు అమెరికా సైన్యాలను మట్టుబెట్టటం ప్రారంభించేసరికి అమెరికా కంగారుపడింది. దాడిసమయంలో కంటే ఇప్పుడు అమెరికా సైనికులు ఎక్కువమంది చనిపోసాగారు. కంగారుపడిన అమెరికా, అమెరికా పెత్తనంలో ఇరాక్ నిర్మాణం జరగాలని, అందుకు ఇతర దేశాలు సైన్యాలను పంపించాలని సమితిలో అమెరికా ఒక తీర్మానం ప్రవేశపెట్టింది. ఆ తీర్మానాన్ని గనుక సమితి ఆమోదిస్తే, అమెరికాకు ఇరాక్‌పై పూర్తి పెత్తనం లభిస్తుంది. అంతేకాదు ఇరాక్ చమురునిల్వలు అమెరికా స్వాధీనం అవుతాయి. ఇరాక్ చమురును చేతిలో పెట్టుకుంటే, ప్రపంచాన్ని తన అదుపులో వుంచుకోవచ్చు. ఈ ఆలోచనతోనే, ఇరాక్‌పై ఇంతకుముందు సమితి విధించిన షరతుల రద్దును కోరింది అమెరికా. ఆ తీర్మానం గనుక సమితి ఆమోదిస్తే, ఇంక తాము అమెరికా చెప్పుచేతలలో నడుచుకోవాల్సి వస్తుందని గ్రహించిన ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలు ఆ తీర్మానాన్ని వ్యతిరేకించాయి. చమురులో తమవాటా కోసం ఈ దేశాలు పట్టుబడుతున్నాయి. రాజీబేరాలు ఆడుతున్నాయి. అంతమాత్రాన వాటిమధ్య వైరుధ్యాలు లేవని అనగలమా? సాయుధ పోరుకు దిగినప్పుడు మాత్రమే వైరుధ్యాలు వున్నట్లు గుర్తిస్తామా? అలా అయితే ఎన్ని దేశాలను జర్మనీ ఆక్రమించిన తరువాత జర్మనీపై ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు యుద్ధం ప్రకటించాయి? అప్పటివరకూ వైరుధ్యాలు లేవని అనగలమా?

రెండవ ప్రపంచయుద్ధానికి ముందు, యుద్ధ సమయంలోనూ సోషలిస్టు శిబిరం లేదు. యుద్ధానంతరమే సోషలిస్టు శిబిరం ఏర్పడింది. తిరిగి ఇప్పుడు సోషలిస్టు శిబిరం లేదు.

అలాంటప్పుడే రెండవ ప్రపంచానికి ముందూ, ఇప్పుడూ సోషలిసు శిబిరం అంటూలేదు. పరిస్థితులు ఒకటిగానే ఉన్నాయి గదా? దీనినిబట్టి ఎవరు ఊహపై ఆధారపడి వ్యాఖ్యచేశారు? అంజయ్యగారు ఏమంటారో?

ఇంతకూ అంజయ్యగారు గందరగోళపడటానికి కారణం వుంది. సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు లేవని ముందుగానే వారు ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే "అసలు సామ్రాజ్యవాద దేశాలు రెండు శిబిరాలుగా ఏర్పడ్డాయనటానికి ఆధారం లేదు" అని రాయగలిగారు. తాను గందరగోళపడి, ఇతరులను గందరగోళ పరచటానికి ప్రయత్నించారు. మార్కెట్ల కోసమే సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఏర్పడతాయన్న విషయం, ఇది స్వార్థంతో కూడినదన్న విషయం అంజయ్యగారు మరచిపోయి, వ్యాఖ్యానానికి పూనుకున్నారు.

ఇంక ఫ్రంట్ ఏర్పాటన్నది వ్యూహానికి సంబంధించినది. అది దీర్ఘకాలానికి సంబంధించినది. ఆ వ్యూహం విజయవంతం కావటానికి ఆ వ్యూహపరిధిలో అమలుజరిపేవి ఎత్తుగడలు. కానీ, అంజయ్యగారు ఎత్తుగడలను, వ్యూహాన్ని కలగాపులగం చేసి ఎత్తుగడలనే వ్యూహంగా చిత్రించి దానిపై నిర్ణయాలకు దిగారు. ఎత్తుగడలు వేసేటప్పుడు ఆ సమయంలో ఆయా దేశాలలోని వాస్తవ పరిస్థితులను, శత్రుబలాన్ని సరిగా అంచనావేసి ఎత్తుగడలు నిర్ణయిస్తారు. పరిస్థితులు మారినప్పుడల్లా ఎత్తుగడలు మారుతూ వుంటాయి. కాని, అంజయ్యగారు చేసినదేమిటి? ఎత్తుగడలనే వ్యూహంగా చూపించి విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం కమ్యూనిస్టు ఉద్యమంలో జరుగుతున్నది కూడా అదే.

ప్రస్తుతం భారతదేశంలో సోషలిస్టు విప్లవం గాని, నూతన లేక జనతా ప్రజాస్వామిక విప్లవం కొనసాగిస్తామని కమ్యూనిస్టులు, విప్లవపార్టీలు కూడా ప్రకటించాయి. అది ప్రస్తుత వ్యూహం. ఇప్పటి పరిస్థితులలో ఎవరు ప్రధాన శత్రువో నిర్ణయించుకోవాలి. కాని అలా నిర్ణయించుకోవటం జరగలేదు. బి.జె.పి. నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం, ప్రతిపక్షంగా వున్న కాంగ్రెస్ రెండూ శత్రువులే అనటంలో సందేహం లేదు. అయితే, "ఒకే సమయంలో అనేకమంది శత్రువులు వుంటారు. వారిలో ప్రధాన శత్రువు ఎవరో ముందు నిర్ణయించుకోవాలి" అని మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పారు. అలా ప్రధాన శత్రువును నిర్ణయించారా? లేదు. ఇద్దరూ శత్రువులే అన్నారు. అటువంటి పరిస్థితిలో ఎత్తుగడలు ఎలా నిర్ణయిస్తారు?

శత్రువుమధ్య వైరుధ్యం అధికారం కోసమే. ఆ వైరుధ్యాన్ని శ్రామికవర్గ అగ్రగామి దళం ఉపయోగించుకోవాలా వద్దా? అలా నిర్ణయించుకోకుండా ఇద్దరూ శత్రువులే. ఇద్దరితోనూ పోరాడతామనటం ఎలా సరైనదవుతుంది? దీనిఫలితంగానే బి.జె.పి.ని తొలగిస్తే కాంగ్రెస్‌ను నెత్తికెక్కించుకుందామా? రాష్ట్రంలో అయితే, తెలుగుదేశాన్ని దించి కాంగ్రెస్‌ను నెత్తినెక్కించుకుందామా? అని ప్రశ్న వేయటం జరుగుతోంది. ఈ విధానం కొనసాగితే, దేశంలో రెండు పార్టీల విధానం-ఇంగ్లాండ్, అమెరికాలలో మాదిరి-అమలులోకి రాదా?

అధికారంలోకి ఎవరు వస్తారన్నది ఎత్తుగడలమీద ఆధారపడి వుంటుంది.

రెండవ ప్రపంచయుద్ధానికి ముందు జర్మనీలో ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాగానే, ప్రపంచ ప్రజలకు ఫాసిజం ప్రధాన శత్రువు అని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. అప్పుడు బలాబలాలు ఎలా వున్నాయి? ప్రపంచంలో సామ్రాజ్యవాదులు బలంగా వున్నారు. సోషలిస్టుశక్తులు బలహీనంగావున్నాయి. అప్పటి వాస్తవపరిస్థితి అది.

ఆ పరిస్థితిలో ఫాసిజాన్ని ఓడిస్తే అధికారంలోకి ఎవరువస్తారు? ఫాసిజం స్థానంలో సామ్రాజ్యవాదులే అధికారంలోకి వస్తారు గదా? కానీ జరిగిందేమిటి? రెండవ ప్రపంచయుద్ధం తరువాత సోషలిస్టు శక్తులు బలపడి, సామ్రాజ్యవాద శక్తులను అదుపులో వుంచగలస్థితికి ఎదగలేదా? దీనికి కారణం ఆనాడు సోవియట్ కమ్యూనిస్టుపార్టీ అనుసరించిన ఎత్తుగడలు కావా? ఇది గుణపాఠంగా తీసుకోమంటే అది గుడ్డిగా మక్కీకి మక్కీ అనుసరించటం అవుతుందా? ఆనాడు కూడా, ఇప్పుడు అంజయ్యగారు వాదించినట్లే సోషల్ డెమోక్రాట్లు వాదించారు.

మూడో ప్రపంచదేశాల విషయంలో కూడా అంజయ్యగారు సమస్యను పక్కదారిపట్టించే విధంగానే వాదించారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు మూడవ ప్రపంచ దేశాలలో ఎక్కువభాగం బానిస దేశాలుగా వున్నాయి. స్వతంత్ర దేశాలు అని చెప్పుకునే దేశాలలో కూడా సామ్రాజ్యవాదులకు అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వాలే అధికారంలో వున్నాయి. తమకు ఎదురుతిరిగిన దేశాలలోని ప్రభుత్వాన్ని, సైనిక తిరుగుబాట్ల ద్వారా, ఇతరవిధాలా కూల్చివేశారు. దక్షిణ అమెరికాలోని చిలీలో అలెండీ ప్రభుత్వాన్ని, ఆసియాలోని ఇండోనేషియాలో సుకర్ణో ప్రభుత్వాన్ని ఆ విధంగానే కూల్చివేశారు. ఈ విషయం అంజయ్యగారికి గుర్తుండి వుంటుందనుకుంటాను.

(చర్చ ముగిసింది)

గుడ్ గవర్నెన్స్ అంటే ఇదీ!

మునిసిపల్, పంచాయితీరాజ్ ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల జీతాల నిమిత్తం ప్రభుత్వం గ్రాంటు ఇస్తుంది. ఆ గ్రాంటు ఎపుడు వస్తుందో అనేది రాష్ట్ర విద్యాశాఖాధికారుల, ఆపైనఆర్థికమంత్రియనమలవారిదయాదాక్షిణ్యాలమీదఆధార పడివుంటుంది. ఉదాహరణకుసెప్టెంబరు,అక్టోబరు, నవంబరు నెలలకు ఒకేసారి గ్రాంటు విడుదల చేశారు. ఈ ఉపాధ్యాయులకు ఏ నెలలోనైనా ఒకటో తారీఖున జీతం వస్తే పెద్దపండగే. ఈ గ్రాంటు విడుదల చేసేటపుడు, ఆ స్థానిక సంస్థలు వసూలు చేసే విద్యా సెస్ మినహాయించి ఇస్తుంది. కాని స్థానిక సంస్థలు వసూలుచేసే విద్యా సెస్ పులుసులో పడిపోతుంది. మీరు ఎంత వసూలుచేశారో చెప్పండి అని జిల్లా విద్యాశాఖాధికారులు స్థానిక సంస్థలను అడిగితే చెప్పరు. వీరిద్దరి మధ్య నలిగిపోయేది ఉపాధ్యాయులే.

ఇక ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల జీతాల చెల్లింపు అయితే అది ఒక దినదినగండం. "ఉపాధ్యాయ ప్రగతి" మాసపత్రిక ఆ కథను ఇలా వివరించింది. "ఏరువచ్చినా నీటికి ఎద్దడే అన్నట్లు, బడ్జెట్‌లున్నా నెలమొదటిజున జీతం తీసుకోవటం ఆశ్చర్యమే. బిల్లులు రాలేదనో, గుమాస్తా లేడనో, జిల్లా విద్యాశాఖాధికారి క్యాంపులో వున్నాడనో, ట్రెజరీవారి ఆబ్జెక్షన్ అనో ఏదోఒక సాకుతో జీతాల చెల్లింపు జాప్యం అవుతూంటుంది. ఏ కారణంచేతనైనా, ఆ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ చాలకో, మరేదైనా కారణం చేతనో జీతాల చెల్లింపు ఆగిపోయిందంటే ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో బకాయిలు చెల్లించడానికి పాఠశాల విద్యా కమీషనర్‌గారి ముందస్తు అనుమతి అవసరం. ఈ ముందస్తు అనుమతికోసం జిల్లా విద్యా శాఖాధికారి కమీషనర్‌కు రాయాలి. ఆ విధంగా రాయడానికి ఎంత మొత్తం బకాయిపడిందో తేలాలి. ఈ విధంగా తేలడానికి ఏ మండలానికి, ఏ ఉన్నత పాఠశాలకు ఎంత బకాయివుందో తేలాలి. ఈ విధంగా తెలియజేయడానికి పాఠశాలవారీగా, అందునా ఉపాధ్యాయుడి వారీగా, అందునా ఆ బకాయి ఏ బాపతుది, ఇదంతా తెలియాలి. ఇవన్నీ తెలిసేటప్పటికి ఏ డిసెంబరో, జనవరో వస్తుంది. తీరా తెలుసుకుని జిల్లా విద్యాశాఖాధికారి కమీషనర్‌కు రాస్తే ఆయన దగ్గర బడ్జెట్ వుండకపోవచ్చు. ఆయన విద్యాశాఖకు, ఆ శాఖ ఆర్థికశాఖ వారికి రాస్తారు. అప్పటికి ఫిబ్రవరి వచ్చేస్తుంది. ఆర్థికశాఖ వివరాలు పంపటం ఇలాకాదు, ఫలానారూపంలో పంపాలన్నతాఖీదు ఇస్తారు. ఆ రూపంలో జిల్లా అధికారి వివరాలు పంపేటప్పటికి మార్చి ముంచుకొస్తుంది. మార్చి 28నో, 29నో లేక 30నో బడ్జెట్ వస్తుంది. లేదా బడ్జెట్ వచ్చిన తర్వాత జిల్లా అధికారి బిల్స్ విడుదల చేసేసరికి అది మార్చి 31వ తేదీ. బిల్సు ట్రెజరీలో పాస్ కావచ్చు, కాకపోవచ్చు. పాస్‌కాకుండా వైకుంఠపాళీ ఆట వచ్చే ఆర్థిక సంవత్సరం ఎలాగూ వుంటుందికదా. ఈ కథ మారేదెపుడు? ఈ వ్యథ తీరేదెపుడు?"

చంద్రబాబూ, వింటున్నారా?

నక్సలైట్లు ఆయుధాలు విసర్జిస్తేకాని చర్చలు సాధ్యం కావనే అభిప్రాయం పూర్తిగా తప్పు. నాగా తీవ్రవాదులను మేము ఎప్పుడూ ఆయుధాలను విడనాడమని కోరలేదు. కాల్పుల విరమణ కోరాము. అసలు ఉద్యమమే సాయుధ పోరాటం అయినప్పుడు ఆయుధాలను వీడమనంటంలో అర్థంలేదు.

– కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, పద్మనాభయ్య

కేంద్రం నాగాలాండ్‌లోని ఎన్ఎస్‌సిఎస్ తిరుగుబాటుదారులతో మాట్లాడుతున్నప్పుడు కాశ్మీర్‌లో హురియత్ కాన్ఫరెన్స్, ఇతర మిలిటెంటు బృందాలతో మాట్లాడితే తప్పేమిటి?

– నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఉమర్ అబ్దుల్లా

ఒక ఇంద్రజాలికుడు మరొక ఇంద్రజాలికుడి వద్ద ఇంద్రజాలం చేయవచ్చా, సాధ్యమవుతుందా! చెప్పండి!

– ముఖ్యమంత్రిని పరామర్శించిన సందర్భంలో విలేఖరులడిగిన ఒకప్రశ్నకు జవాబుగా ప్రఖ్యాత ఇంద్రజాలికుడు జాదూగర్ ఆనంద్

దేశంలో మతకల్లోలాలను సృష్టించేవిధంగా ప్రవర్తించే విశ్వహిందూపరిషత్ నాయకులమీద కఠినచర్యలు తీసుకోవాలి. విశ్వహిందూపరిషత్‌ను దేశవ్యాప్తంగా నిషేధించాలి. విశ్వహిందూ పరిషత్ సంఘవ్యతిరేక శక్తిగా తయారైంది.

– ఎస్. జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్

ఇరాక్‌ను ధ్వంసంచేయటం ద్వారా ఇరాక్ సార్వభౌమాధికారాన్ని, స్వేచ్ఛను అమెరికా సేనలు హరిస్తున్నాయి...పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ అరాచకం పెరిగిపోతుంది.

– అబ్దెల్ జాహెద్ బల్కేజీజ్ (ఇస్లామిక్ దేశాల సంస్థ)

22 శాతం మంది పేదరికం కారణంగానూ, 3 శాతం మంది పోలీసు వేధింపుల వల్ల పీపుల్స్‌వార్‌లో చేరుతున్నారు. సిద్ధాంతాలకు ఆకర్షితులై వార్‌లో చేరుతున్నవారికంటే పోలీసు వేధింపుల కారణంగా చేరుతున్నవారు ఒకశాతం ఎక్కువ.

– పోలీసు అధ్యయన నివేదిక

ఏ కార్మికుల సమస్యలనైనా అధికారవర్గాలు పట్టించుకోనప్పుడు ఆయా పరిష్కార వేదికలతో కార్మికులు విసిగి వేసారిపోయినప్పుడు నియమాలకు లోబడి నిరసన తెలియజేసే హక్కు వారికి వుంది. పారిశ్రామికవివాదాల చట్టం 1947లో అందుకు ఏర్పాట్లు ఉన్నాయి.

– కేంద్ర కార్మికమంత్రి సాహెబ్‌సింగ్ వర్మ

అవినీతి విషయంలో 133 దేశాల జాబితాలో భారత్ 83వ స్థానంలో నిలిచింది.

– ఓఆర్‌డి మార్గ్–ట్రాన్సఫరెన్సీ ఇంటర్నేషనల్ సర్వే

అమెరికాలో సామాజిక భద్రత రోజురోజుకు కరువైతుంది. క్రమంగా శ్రామికుల సంఖ్య తగ్గుతుంది. వారంలో 40 గంటలకు బదులు 46 గంటలు పనిచేయాల్సివస్తుంది. సమ్మెలు పెరుగుతున్నాయి. సమ్మెలు, ప్రదర్శనలపై నిషేధం లేదు. నిషేధం విధిస్తే ఎటువంటి సంకోచం లేకుండా ఆందోళన చేపడతాము.

– అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ అండ్ కాంగ్రెస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్స్ (ఎఎఫ్ఎల్‌సిఓ). (అమెరికాకు చెందిన అతిపెద్ద ట్రేడ్‌యూనియన్)

కోర్టులు తీవ్రమైన నేరాలు నమోదుచేసిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీచేయకుండా చట్టం తేవాలి. ఎన్నికలద్వారా నేరస్థులు రాజకీయ వ్యవస్థలో ప్రవేశిస్తున్నప్పుడు రాజకీయాలు దిగజారిపోతున్నాయి.

– ఎన్నికల ప్రధాన కమీషనర్ లింగ్డో

మల్టీ విటమిన్ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి అతి శక్తివంతమైన సాధనం. 65 ఏళ్ళ పైబడిన పెద్దవాళ్ళు రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడంతో తరచూ మందులు వాడడం ఆసుపత్రుల చుట్టూ తిరగటం లాంటి సమస్యలను దీనినుండి అధిగమించవచ్చు.

–యూత్ కన్స్యూమర్ హెల్త్ తరఫున లెవిన్ గ్రూపు నిర్వహించిన అధ్యయనం

నక్సలైట్ల చర్చలను తోసిపుచ్చకూడదు. నక్సలైట్ సమస్యను సామాజికార్థిక సమస్యగా పరిగణిస్తూ ఆస్తుల ధ్వంసం, హింసను ఆపడానికి సైతం నక్సలైట్లపై చట్టపరిధిలోనే పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– సిబిఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్

అమెరికా అధికారుల అండతో ముషార్రఫ్ తన ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడు. ముషార్రఫ్ పాలనలో పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం అంతమైంది. తన నాలుగేళ్ళ పాలనలో రాజకీయ ప్రత్యర్థులు జర్నలిస్టులు, ప్రభుత్వ మాజీ అధికారులమీద వేధింపులు, హింసలు బ్లాక్‌మెయిల్లు ఎక్కువయ్యాయి.

– హ్యూమన్ రైట్స్ వాచ్ (అమెరికా)

నక్సల్స్‌సమస్య కేవలం చర్చల ద్వారా మాత్రమే పరిష్కార మవుతుంది. ఇప్పుడాసమయం వచ్చింది.

– లక్ష్మీపార్వతి

నక్సల్స్‌తో చర్చలు జరపక తప్పదు. చర్చలవల్ల శాంతి నెలకొనే అవకాశం వుంది.

– ఎన్. ఇంద్రసేనారెడ్డి, బిజెపి

'నాలుగేళ్ళు పాలించినందుకు వాజ్‌పేయికి అభినందనలు' - వార్త

- ఎన్నాళ్ళని కాదు, ఎలా పాలించారనేదే గీటురాయి.

'రాష్ట్రం బాగుపడుతుందంటే ఏమైనా చేస్తా' - ముఖ్యమంత్రి

- రాష్ట్రం బాగుపడవచ్చు. కాని ప్రజలు బాగుపడతారా అనేగా అసలు ప్రశ్న.

'అధికారులకు చంద్రబాబు హెచ్చరిక' - ముఖ్యమంత్రి

- ఎన్నోసారి అన్నారీమాట బాబూజీ? ఈ ఓవరాక్షన్లు మాని ఏక్షన్‌లోకి దిగండి.

'30 సంవత్సరాలు ఆయుధాలు పట్టుకొని ఏం సాధించారు' - ముఖ్యమంత్రి

- 30 సంవత్సరాలు నక్సలైట్ సమస్యను శాంతిభద్రతల సమస్యగా పరిగణించి ప్రభుత్వం ఏం సాధించింది?

అంతర్‌రాష్ట్ర దోపిడీముఠా అరెస్టు' - వార్త

- అంతర్‌రాష్ట్ర నకిలీనోట్ల నాయకుడు మాత్రం ఆంధ్రపోలీసు కళ్ళకు కనపడలేదు.

'జైలులో పెట్టినా కొందరు బిగ్‌బాస్‌లు జైలునుండే తమ నేర సామ్రాజ్యాన్ని ఏలుతున్నారు' - వార్త

- టట్, అడ్డమైనవాళ్ళందరికీ బిగ్‌బాస్ టైటిలు తగిలించి అసలు బిగ్‌బాస్‌ను అవమానం చెయ్యకండి.

'అక్షరాస్యతకు హైటెక్ టెక్నాలజీ' - మంత్రి మండవ

- అంటే కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలక్కూడా ఎసరుపెడతారా?

'ఆర్.టి.సి.ని నష్టాల నుంచి గట్టెక్కిస్తా' - ఆర్.టి.సి. కొత్త ఎం.డి.

- ప్రైవేటుబస్సుల విచ్చలవిడి విహారాన్ని పూర్తిగా అరికడితేచాలు.

'సోనియా అబద్ధాలకోరు' - సుబ్రహ్మణ్యస్వామి

- అబ్బ, ఇన్నాళ్ళకో సత్యహరిశ్చంద్రుడు పుట్టాడు మనదేశంలో.

'అధికారులూ నడత మార్చుకోండి' - మంత్రి చిక్కాల

- ముందు మంత్రులతో ప్రారంభిస్తే బాగుంటుందేమో,

'దేశం దోస్తీ తప్ప మరో ఊసేలేదు' - బిజెపి చింతన్ బైఠక్

- చిన్న సవరణ మరో 'గతి'లేదు.

'మెరుగైన సేవలకోసం ఆర్టీసి వెబ్‌సైట్' - వార్త

- ఏ సైట్ అక్కర్లేదు బస్సుస్టాపులో బస్సు ఆగితే అదే పదివేలు.

'నేను మారాను ' - ముఖ్యమంత్రి

- అవునా! ఏమి తేడా కనిపించట్లేదే!

'వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు ప్రజాకర్షక విధానాల వల్ల వచ్చినవే' - ముఖ్యమంత్రి

- ప్రతిపక్షాలు నెత్తిన నోరుపెట్టుకుని ఎప్పటినుంచో ఇదే చెబుతూ వస్తున్నాయి. ఇప్పటికి మీకు జ్ఞానోదయం అయింది సంతోషం.

'ప్రజల్లోకి రండి' - నక్సల్స్‌కు మంత్రిమండలి పిలుపు

- ముందు మీరు పట్టణాలు వదిలిపెట్టి పల్లెల్లోకి వెళ్ళండి.

'తిరుమలలో హెలిప్యాడ్' - పోలీసు ప్రతిపాదన

- అంటే రోడ్డు ప్రయాణంలో విఐపిలకు భద్రతలేదని అంగీకరించినట్లేగా.

'రాష్ట్రంలో పెట్టుబడులకు తీవ్రవాదం ఆటంకం' - ముఖ్యమంత్రి

- అదేమిటి?.... కోట్లరూపాయల ప్రతిపాదనకు ఆమోదం కూడా ఇచ్చామని మేరే చెప్పారుగా?

'మీరు తుపాకులతో ఏమీ సాధించలేరు'-నక్సలైట్లకు ముఖ్యమంత్రి హితవు

- ఆ విషయం పోలీసులకు చెప్పండి. 30 ఏళ్ళనుంచి తుపాకుల తోనే నక్సలిజాన్ని తుదముట్టించేస్తామని అంటున్నారుగా.

'ప్రపంచబ్యాంకు రుణాలకు చెల్లుచీటీ' - ప్రభుత్వ ఆలోచన

- శుభస్య శీఘ్రం

'సంస్కరణలు వేరు, ప్రైవేటీకరణ వేరు'-కార్మికనాయకుడు సంజీవరెడ్డి

- సంస్కరణల లక్ష్యమే ప్రైవేటీకరణ అన్న చిన్న విషయం కూడా తెలియనంత అమాయకుడు కాదే!

ఇవండీ! దేశంలో మందుప్రియుల మద్యపానం లెక్కలు!

2003లో మందుప్రియులు ఎనిమిదిన్నర కోట్ల కేసుల మందు కొట్టేశారు. గత 13 సంవత్సరాల్లో అంటే సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత ఈ తాగుడు 190 రెట్లు పెరిగింది. ఇందులో విదేశాల నుంచి వచ్చే మందు అయిదున్నర లక్షల కేసులు మాత్రమే. వివరాల్లోకి పోతే ఇందులో 4.7 కోట్ల కేసుల విస్కీ (విదేశీ అయిదు లక్షలు), 13 లక్షల కేసుల జిన్, 160 లక్షల కేసుల రమ్, 4 లక్షల వోడ్కా, 177 లక్షల కేసుల బ్రాందీ, 6 లక్షల కేసుల వైన్. (ఒక కేసుకు 24 సీసాలు)

ప్రతికూల పవనానికి పునాది ఏమిటి?

(తెలుగుదేశం పతన కారణాలు-1)

— వి. గోపాల్

(ఎన్నికల వాతావరణం వ్యాపిస్తున్న ఈ తరుణంలో 1989లో తెలుగుదేశం ప్రభుత్వం రెండోసారి ఎన్నికలకు వెళ్లి భంగపడిన సందర్భంలో ఆంధ్రపత్రిక దినపత్రిక డిసెంబరు 3, 4, 5 సంచికల్లో తెలుగుదేశం ప్రభుత్వ పతన కారణాలను విశ్లేషిస్తూ వచ్చిన ఈ వ్యాసంలో చాలా అంశాలు ఇవాళ్టి వాతావరణానికి సరిపోతాయి. ఈ నేపథ్యంలో ఈ పునరుక్తి - సం)

అజేయమైనదనిపించిన తెలుగుదేశం ప్రభుత్వం కుప్పకూలి పోయింది. గతంలో రెండు ఎన్నికలలోనూ 202 స్థానాలను గెలుచుకుని, మూడింట రెండువంతుల పైగా ఆధిక్యత నిలుపుకున్న తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికలలో పావువంతు స్థానాలను కూడా గెలుచుకోలేకపోయింది.

అయితే స్థానాలవారీగాకాక, వోటింగ్ సరళిని పరిశీలిస్తే మొత్తం మీద పదిశాతం వోట్లు మాత్రమే తెలుగుదేశం నుంచి కాంగ్రెస్(ఐ)కి తరలిపోయాయని తెలుస్తుంది. 1985 ఎన్నికలలో 37.2 శాతం వోట్లు సంపాదించిన కాంగ్రెస్(ఐ) ఈ ఎన్నికలలో 47.6 శాతం వోట్లు సంపాదించింది. 1985 ఎన్నికలలో 53.7 శాతం వోట్లు సంపాదించిన తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికలలో 43.7 శాతం వోట్లను మాత్రమే సాధించగలిగింది.

ఈ అంకెలను జాగ్రత్తగా విశ్లేషిస్తే కాంగ్రెస్(ఐ)కి తెలుగుదేశం కన్నా కేవలం 3.9 శాతం వోట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయని అర్థమవుతుంది. స్థానాలవారీగా చూసినప్పుడు 106 స్థానాల తేడాగా కనబడేదల్లా వోట్లశాతానికి వచ్చేసరికి ఇంత తక్కువగా తేలిపోతుంది. అందులోనూ 1985 ఎన్నికలకూ, ప్రస్తుత ఎన్నికలకూ మధ్య మరో ప్రధానమైన తేడా వుంది. వోటింగ్ వయోపరిమితిని 18 ఏళ్ళుగా తగ్గించడం వల్ల మనరాష్ట్రంలో 7.42 శాతం వోటర్లు పెరిగారు. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇవాళ కాంగ్రెస్(ఐ) సాధించినది చెప్పుకోదగిన ఘనవిజయమేమీ కాదని అనిపిస్తుంది.

కానీ ఈ నాలుగుశాతం వోట్ల ఆధిక్యతే కాంగ్రెస్(ఐ)కి ఇప్పుడు అధాకారాన్ని కట్టబెడుతున్నది గనుక, గతంలో తెలుగుదేశం పార్టీకి బలమైన కోటలుగా ఉన్న ప్రాంతాలలో కూడా కాంగ్రెస్(ఐ) చెప్పుకోదగినన్ని స్థానాల్ని గెల్చుకున్నది. గనుక తెలుగుదేశం వైఫల్యాన్ని అర్థంచేసుకోవలసి వుంది. తెలుగుదేశం తాను 1985లో గెలుచుకున్న వోట్లలో నుంచి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 17.2 శాతం వోట్లను, ఖమ్మం జిల్లాలో అత్యల్పంగా 0.2 శాతం వోట్లను కోల్పోయింది. మొత్తంమీద ఏ ఒక్క జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ తన గత స్థాయిని కూడా నిలుపుకోలేకపోయింది.

రాష్ట్ర కాంగ్రెస్(ఐ)కి సరైన నాయకుడు లేకపోయినా, కేంద్రంలో కాంగ్రెస్(ఐ) అనేక వివాదాలలో చిక్కుకునివున్నా, చాలాచోట్ల కాంగ్రెస్(ఐ) అభ్యర్థులు జనామోదం ఉన్న అభ్యర్థులు కాకపోయినా, కొనిచోట్ల పూర్తిగా అపరిచితులైనా విజయం కాంగ్రెస్(ఐ) కాంగ్రెస్(ఐ) అభ్యర్థులనే వరించింది. ఇందుకు కారణం ప్రస్తుత వోటింగ్ సరళిలో కాంగ్రెస్(ఐ) అనుకూల వోట్లకంటే, తెలుగుదేశం వ్యతిరేక వోట్లు వుండడమే. ఈ విషయాన్ని చాలామంది రాజకీయ పరిశీలకులతో పాటు రాజకీయనాయకులు కూడా గుర్తించే ఉన్నారు. ఈ ఎన్నికలలో ప్రధానంగా 'ప్రభుత్వ వ్యతిరేక వోటు' తన ప్రభావాన్ని చూపింది.

రాష్ట్రంలో ఈ ప్రభుత్వ వ్యతిరేక వోట్లు ఎందుకు ఎట్లా తలెత్తింది? ఈ నెగటివ్ వోట్‌ను అర్థంచేసుకుంటే తెలుగుదేశం పతనంలో దాని పాత్ర అర్థమవుతుంది. పైగా పాజిటివ్ వోట్‌ను క్షణాలమీద ఏవో భ్రమలతో, భయాలతో సృష్టించవచ్చును గాని, నెగటివ్ వోట్ వోటర్ల మనసుల్లో పేరుకుపోతున్న అసంతృప్తి ఫలితంగా ఏర్పడినదై ఉంటుంది. ఒక్కోసారి దానివయసు ఐదు సంవత్సరాలు కూడా ఉండవచ్చు. దాని బలం మౌనంగానూ, అప్రతిహతంగానూ ఉంటుందని 1977 ఎన్నికలు ఇదివరకే రుజువుచేసిఉన్నాయి. ఇప్పుడు ఆ విషయమే మరొకసారి రుజువైంది.

దేశంలోని రాజకీయ నాయకులందరిలోకీ ఎక్కువ సమ్మోహక శక్తి ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందిన ఎన్.టి.రామారావు వోటర్లను సమ్మోహకపరచడంలో విఫలం కావడం మాత్రమేకాక నెగటివ్ వోట్‌ను ఎందుకు ఎదుర్కోవలసివచ్చింది?

ఎన్.టి.రామారావు పట్ల, తెలుగుదేశం పార్టీ పట్ల వ్యతిరేకత వ్యక్తం కావడానికి ఎన్నో కారణాలున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం, పార్టీ గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర రాజకీయ సామాజిక ఆర్థిక రంగాలలో అనుసరిస్తూ వచ్చిన అనేక విధానాలు ప్రజలనుంచి వ్యతిరేకతను, అసంతృప్తిని ఎదుర్కొన్నాయి. చాలా సందర్భాలలో తెలుగుదేశం పార్టీకి ఖచ్చితమైన విధానాలు లేవని, ఏక వ్యక్తి నిరంకుశత్వం కింద ఆ వ్యక్తి మనసులో సాగే ఊగిసలాటలన్నీ ప్రభుత్వ విధానాలుగానో, పార్టీ విధానాలుగానో వెలువడుతున్నాయనీ అనిపించింది.

గత ఆరు సంవత్సరాల పరిపాలనా క్రమంలో, ఏడు సంవత్సరాల రాజకీయ మనుగడలో తెలుగుదేశం పార్టీ ఏయే లక్ష్యాలను ప్రకటించి, ఏయే ఫలితాలను సాధించి ఇవాళ్టి ఈ ప్రతికూల పవనాలకు పునాది కల్పించిందో వివరంగా అర్థం చేసుకోవడం మన రాజకీయ, సామాజిక సంస్కృతికి అవసరం.

తెలుగుసీమలో అప్పటికి సాగుతుండిన కాంగ్రెస్ పాలనలో ముఠా కుమ్ములాటల పట్ల, అవినీతి పట్ల, అరాచకత్వం పట్ల విసుగుతో, కోపంతో ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టాభిషేకం చేశారు. ఈ సమస్యలను సవ్యంగా వినియోగించుకోవడంలో, ఢిల్లీ పాదాలచెంత తెలుగువాడి ఆత్మగౌరవం మంటకలుస్తున్నదని 'జాతీయాభిమానాన్ని' రెట్టగొట్టడంలో ఎన్.టి.రామారావు విజయం సాధించారు. కనుక తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలోనూ, అధికార పీఠాన్ని ఆక్రమించడంలోనూ ఆ పార్టీ అవినీతికీ, ముఠా తగాదాలకూ, అరాచకత్వానికీ దూరంగా ఉండగలదనే ప్రజల ఆకాంక్ష ఇమిడిఉంది, 1970ల తర్వాత దేశవ్యాప్తంగా అన్ని భాషా వర్గాలలోనూ తమతమ భాషా సంస్కృతుల పట్ల, "జాతి స్పృహ" పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో, తెలుగుజాతి ప్రతినిధిగా ఎన్.టి. రామారావు వ్యవహరించగలరనే అభిప్రాయం 1983లో వ్యక్తమైంది.

అన్ని పార్టీల ప్రణాళికలలాగానే తెలుగుదేశం పార్టీ ప్రణాళిక కూడా ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపింది. ప్రణాళిక చదివి ప్రభుత్వాలను ఎన్నుకునే వాళ్ళెవరూ ఉండరుగాని ప్రణాళిక ప్రకటనకూ, ప్రణాళిక అమలుకూ మధ్య అంతరాన్ని బట్టి ఆయా ప్రభుత్వాల చిత్తశుద్ధిని గుర్తించవచ్చు. అంతేగాక ప్రణాళికలోని పలు అంశాల ప్రచారం వల్లనే ప్రభుత్వానికి ప్రజామోదం లభిస్తుంది గనుక ఆ అంశాల అమలుతీరు మీదనే ఆ ప్రజామోదం ఆధారపడి వుంటుంది. తెలుగుదేశం పార్టీ ప్రణాళికలో ఏమి ఉన్నప్పటికీ, రాష్ట్రం నలుమూలలా ఎన్.టి.రామారావు చేసిన గంభీరమైన వాగ్దానాలకూ, వాస్తవికంగా ఎన్.టి.రామారావు ప్రభుత్వం సాగించిన పాలనకూ మధ్య ప్రజలు అంతరాన్ని గుర్తించిన ఫలితమే ఈ ఓటమి.

తెలుగుజాతి సర్వతోముఖాభివృద్ధి కోసం అవతరించానని చెప్పుకున్న తెలుగుదేశం ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలలోనూ సర్వతోముఖ అసంతృప్తిని సాధించింది. రైతులు, కార్మికులు, విద్యార్థులు ఉద్యోగులు, మహిళలు, రాజకీయంగా భిన్నాభిప్రాయం గలవాళ్ళు–ఇట్లా ప్రతి వర్గానికీ వర్తించే విధానాలలో ఆయా వర్గాల వ్యతిరేకతనే తెలుగుదేశం ప్రభుత్వం చవిచూసింది.

అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వోద్యోగుల రిటైర్‌మెంట్ వయోపరిమితిని 58 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాలకు తగ్గించింది. ఎన్.జి.వో.ల నుంచి ఈ చర్యకు తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. మూడు దశాబ్దాలుగా ప్రభుత్వోద్యోగం చేస్తూ, ప్రధానంగా ఉద్యోగం మీదనే జీవిక గడిపే ఉద్యోగులు ఒక్క కలంపోటుతో నిరుద్యోగులైపోవడం, వారిమీద ఆధారపడిన వేలాదిమంది కుటుంబ సభ్యులు నిస్సహాయులైపోవడం చెప్పుకోదగిన జనాభాలో ప్రభుత్వ వ్యతిరేకతను పెంచాయి. ఈ నిర్ణయాన్ని నాదెండ్ల భాస్కరరావు ప్రభుత్వం మార్చివేసినప్పటికీ, జరిగిన అవమానం చాలా కుటుంబాలలో ఇప్పటికీ కలకవేస్తుందన డంలో సందేహం లేదు.

ఇక అప్పటినుంచి తెలుగుదేశం పాలనలో ఒక్కొక్క వర్గంమీద వ్యతిరేకచర్యలు ప్రారంభమయ్యాయి. ఒకవైపు చాలా ఆర్భాటంగా జనాకర్షక పథకాలు ప్రకటిస్తూ, గత ప్రభుత్వాల కన్నా భిన్నమైన, ఆకర్షణీయమైన ప్రణాళికలు తనవద్ద ఉన్నాయని భ్రమలు కల్పిస్తూ, విడివిడిగా ప్రతివర్గంపైన ప్రతికూల ప్రభావం వేసే చర్యలనే ప్రభుత్వం చేపడుతూ వచ్చింది.

తెలుగుదేశం ప్రభుత్వం పాలనాకాలంలో ధరల పెరుగుదలకు సంబంధించి ఏ నిరోధకచర్యలూ అమలుజరగలేదు సరిగదా, స్వయంగా ప్రభుత్వం ఆధీనంలోని సేవల ధరలు కూడా విపరీతంగా పెరుగుతూ వచ్చాయి. అంతకుముందు కాంగ్రెస్(ఐ) పాలనలో ఇటువంటి ధరల పెరుగుదలకు ఏ సమర్థనలూ, సంజాయిషీలూ వినబడేవో అదేసమర్థనలూ, సంజాయిషీలూ తెలుగుదేశం ప్రభుత్వం నుంచి కూడా వినబడడం మొదలైంది.

తెలుగుదేశం పాలనాకాలంలో ఆర్.టి.సి. బస్సుఛార్జీలను నాలుగుసార్లు పెంచారు. ప్రయాణీకుల మీద పెరిగే భారం విషయంలో గత ప్రభుత్వలకూ, ఈ ప్రభుత్వానికీ మధ్య ప్రజలు ఏ తేడా చూడలేకపోయారు. పాల విక్రయధర విషయంలో, విద్యుత్ ఛార్జీల విషయంలో కూడ ఇదే పరిస్థితి సాగింది.

ప్రజల నిత్యజీవితావసర వస్తువులపై విధించే అమ్మకం పన్నును పెంచడంద్వారా అంతిమంగా ప్రజలైనే ఆ భారం పడేలా చేయడంలో తెలుగుదేశం ప్రభుత్వం వెనుకాడలేదు. ప్రవేశ పన్నును కొత్తగా ప్రారంభించి ధరల పెరుగుదలకు ప్రభుత్వం తోడ్పడింది.

భూసంస్కరణలను, వ్యవసాయ సంబంధాల సంస్కరణను స్పష్టంగానే వ్యతిరేకించే ఎన్.టి.రామారావు ప్రభుత్వం స్థాపించిన తర్వాత తన ఈ వ్యతిరేకతను దాచిఉంచడం అలవరచుకున్నారు గాని, భూసంస్కరణలకు అనుకూలం కాలేకపోయారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంతాలలో భూసంస్కరణలను నిర్లక్ష్యం చేయడం మాత్రమే కాకుండా అటవీ ప్రాంతాల భూసంబంధాల పట్ల తెలుగుదేశం ప్రభుత్వం కనీస సంస్కరణ దృక్పథాన్ని విడనాడింది.

అటవీప్రాంత ప్రజానీకపు అమాయకత్వం, నిరక్షరాస్యతలను ఆసరాగా చేసుకొని మైదాన ప్రాంతాల భూస్వాములు అటవీ భూములను కాజేయవచ్చుననే ఆలోచనతో బ్రిటిష్ పాలనాకాలం నుండే కొన్నిరక్షణలు కల్పించడం జరిగింది. అటవీప్రాంత భూముల్ని ఇతర ప్రాంతాలవారు కొనేందుకు, ఆక్రమించుకొనేందుకు వీలులేదనే చట్టాలు వచ్చాయి. అటువంటి చట్టాలలో ఒకటైన రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970 అనేదానిని రద్దుచేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించింది.

రైతాంగానికి తన సర్వశక్తులూ ధారపోసి సహాయం చేస్తానన్న ప్రభుత్వం నీటితీరువా రేట్ల విషయంలో విపరీతమైన పెరుగుదల పట్ల మౌనంగా ఉండిపోయింది. గిట్టుబాటు ధరలకోసం రైతులు ఆందోళనలకు దిగితే వారిమీద కాల్పులు జరిపింది. పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడితే వేరుశనగ, పొగాకు, చెరకు రైతులు చాలీచాలని ధరలతో ప్రభుత్వానికి మహజర్లమీద మహజర్లు సమర్పించుకున్నారు.

ప్రభుత్వోద్యోగులు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మెకు దిగితే ప్రభుత్వం వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించేబదులు కక్షసాధింపు వైఖరిని చేపట్టింది. జాతీయ భద్రతా చట్టాన్ని, అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టాన్ని, రాజ్యాంగంలోని 311 అధికరణాన్ని ఉపయోగించి ఉద్యోగులమీద విరుచుకుపడింది. ఉపాధ్యాయ ఉద్యమం కూడా రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఇటువంటి ఇక్కట్లనే ఎదుర్కోవలసి వచ్చింది. ○

(ఆంధ్రపత్రిక వ్యాస వేదిక)

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ.120/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.
వి. హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Printed, Published and Owned by by **V. Hanumantha Rao** for **Samata Publications** D.No. 8-3-898/22, Road No.3, Nagarjuna Nagar, Hyderabad-73. Ph: 23748672
Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. —Editor, V. Hanumantha Rao